నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
1
మంగళవారం | ఏప్రిల్ 23, 2024 | www.navatelangana.com

స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలి



బల్దియ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్

స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ తానాజీ వాకాడే అన్నారు. వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాలల్లో సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా దసరా రోడ్డు, గవిచర్ల క్రాస్ వద్ద స్మార్ట్‌సిటీలో భాగంగా కొనసాగుతున్న పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలన్నారు. నాయుడు పెట్రోల్ పంపు వద్ద జంక్షన్ అభివృద్ధి పనులను మొదలు పెట్టాలని అధికారును ఆదేశించారు. ఖమ్మం రోడ్డు ప్రధాన రహదారి ప్రాంతంలో నిర్మిస్తున్న గ్రాండ్ ఎంట్రేన్స్ పనులను కమిషనర్ పరిశీలించారు. కొనసాగుతున్న ఉర్సు ట్యాంక్‌బండ్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసు కున్నారు. వేసవికాలం లోగా పూర్తి చేయాలన్నారు. అంతకుముందు ఇదే ప్రాతంలో కొనసాగుతున్న 5ఎంఎల్‌డిఎస్‌టిపి ప్లాట్‌ను అకస్మికంగా తనిఖీ చేసి మురుగు నీటి శుద్దీకరణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యాక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, హెచ్ ఓ రమేష్, ఈఈ శ్రీనివాస్, సంజయ్ కుమార్,డిఈ లు రవికిరణ్, సారంగం, కృష్ణ మూర్తి,ఎఈ మొజామిల్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్య నామినేషన్ దాఖలు

రైతులను పొట్టనపెట్టుకున్న మోదీ

ఎమ్మెల్యే గండ్ర సత్తెన్న

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పార్లమెంటు నియోజకర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం వరంగల్ కలెక్టరేట్‌కు విచ్చేసిన కడియం కావ్య వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, నాయిని రాజేందర్‌రెడ్డి, కెఆర్ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

760 మంది రైతులను పొట్టనపెట్టుకున్న మోదీ : గండ్ర సత్తెన్న

కేంద్రంలోని మోదీ 760 మంది రైతులను పొట్టన పెట్టుకున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా, స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాహుల్‌గాంధీని గెలిపించడనికి కావ్యను ఇక్కడ గెలిపించాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా భారీ వర్షాలతో మునిగిపోతే కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాళేశ్వరంలో అవినీతికి పాల్పడ్డారని, నిరుద్యోగ భృతి ఇస్తానని హామి నెరవేర్చలేదన్నారు. 4 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలలో 5 గ్యారెంటీలను అమలు చేశామన్నారు.

విభజన చట్టం అమలు చేయని బీజేపీ : ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

విభజన చట్టం అమలు చేయకపోవడంతో మన జిల్లాకు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ రాకుండా పోయాయని, బిజెపి, బిఆర్ఎస్‌లు ప్రజలకు వివరణ ఇవ్వాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బిజెపి, బిఆర్ఎస్‌లు అసమర్థ పార్టీలన్నారు. హామిలను అమలు చేయకుండా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

పాంచ్ న్యాయ్ అమలు చేస్తాం : వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాంచ్ న్యాయ్ అమలు చేస్తుందని, మత, కుల వివక్షను కాంగ్రెస్ పార్టీ ప్రదర్శించదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు స్పష్టం చేశారు. 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చుతామంటున్నారని, బిజెపి అభ్యర్థి గజదొంగ అని, మండలానికో గెస్ట్ హౌజ్ నిర్మించుకున్నాడన్నారు. డాక్టర్ కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం వరంగల్ కలెక్టరేట్‌కు వచ్చి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి వైస్ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కావ్య స్థానికేతరురాలు : ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య స్థానికేతరురాలని, గుంటూరు జిల్లా వ్యక్తిని పెళ్లి చేసుకోలేదా ? అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. సుధీర్ చరిత్రను చూసి ఓటేయాలని కోరారు. కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌ల చరిత్రను కూడా పరిశీలించాలన్నారు.



ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

నవతెలంగాణ-నెక్కొండ

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి తన జీవితంలో పదవి విరమణ సహజమని, ఉద్యోగి తన పదవీ విరమణతో తన అనుభవాన్ని సమాజ సేవకు అంకితం చేయాలని పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్ సింగ్, యాకుబ్ రెడ్డి అన్నారు. నెక్కొండ మండలం నాగారం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జడల శ్రీనివాస్ పదవీ విరమణ, సన్మానసభ ఘనంగా నిర్వహించారు. పదవి విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడు జడల శ్రీనివాస్ రజిత దంపతులను నెక్కొండ పిఆర్టియు మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఘనంగా శాలువాలు, మెమోంటో సన్మానించారు. ఈ సందర్భంగా పిఆర్టియు నెక్కొండ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్ సింగ్, యాకుబ్ రెడ్డి లు మాట్లాడుతూ శ్రీనివాసరావు పాఠశాలకు, ఉపాధ్యాయులకు, సంఘానికి చేసిన సేవలను కొనియాడారు. పదవీ విరమణ చేసినా కూడా ఉపాధ్యాయులకు, సంఘానికి వారి సేవలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రత్నమాల, పిఆర్టియు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్ లు, జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, యాకయ్యసోమవరపు యుగంధర్, పర్వతగిరి మండల అధ్యక్షులు రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు, మండల భాద్యులు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బీఆర్ఎస్ మద్దతా..?

సందేహాలతో అయోమయం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పార్లమెంటు (ఎస్టీ) నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతిస్తుందా ? అన్న సందేహాలు వ్యక్త మవుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని వదులుకొని చివరి నిమిషంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె డాక్టర్ కడియం కావ్య కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ నాయకత్వం 'కడియం'ను లక్ష్యంగా చేసుకొని తీవ్ర ఆరోపణలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. 'కడియం' కాంగ్రెస్‌లో చేరాక అంతకుముందే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకొని 'తాటికొండ'ను 'కడియం'పైకి అస్త్రంగా వదిలినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. 'తాటికొండ' నోటికొచ్చిన మాటలతో 'కడియం'పై దాడి చేస్తుండడం రాజకీయాల్లో చర్చకు దారితీసింది. 'తాటికొండ' మాటలు పార్టీకి మేలు చేస్తాయా ? లేక కీడు చేస్తాయా ? అన్న భావనలో సైతం బిఆర్ఎస్ లేకపోవడం గమనార్హం. ఇదిలావుంటే పార్లమెంటు టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీ నుండి పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన విషయం విదితమే. ఈ క్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌కు కాకుండా పలు నియోజకవర్గాల్లో పలువురు నేతలు బీజేపీ అభ్యర్థికి సహకరించే అవకాశాలున్నాయని రాజకీయంగా చర్చ జరుగుతుంది. దీంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. బీజేపీ ప్రచారం తీవ్రతరం చేసినా ఆయా నియోజకవర్గాల్లో క్యాడర్ లేకపోవడం ఆ పార్టీకి తలనొప్పిగా పరిణమించింది. ఈ పార్లమెంటు నియోజకవర్గంలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట (ఎస్సీ), స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ), పాలకుర్తి, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాలు ఈ నియోజకవర్గాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే వుండడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ఆ పార్టీ వర్గాలు విశ్వాసంతో వున్నాయి. ఇదిలావుంటే కాంగ్రెస్‌కు గట్టి పోటీనివ్వాలని భావించిన బీఆర్ఎస్ నాయకత్వం సరైన అభ్యర్థిని ఖరారు చేయడంలో ఆలస్యం చేసింది. ఎట్టకేలకు వరంగల్ అర్బన్ జెడ్పీ ఛైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను బరిలోకి దించింది. సుధీర్ గెలుపు కోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ఆయా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్‌ను వీడి ఈ పార్లమెంటు నియోజకవర్గంలో బరిలోకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌లు బీఆర్ఎస్‌కు ద్రోహం చేశారంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. 'అరూరి' కంటే 'కడియం'పైనే ఫోకస్ అధికంగా పెట్టినట్టు కనిపిస్తుంది. బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య 'కడియం'పై చేసే విమర్శలు మరీ స్థాయికి తగ్గట్టు లేకపోవడం సైతం చర్చకు దారితీసింది. గత మూడ్రోజులుగా 'తాటికొండ' చేస్తున్న విమర్శలపై 'కడియం' స్పందించకపోవడం గమనార్హం.

బీజేపీ గట్టి పోటీనిచ్చేనా ..?

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో మోదీ ఇమేజీతో బీజేపీ గెలుస్తుందని ఆ పార్టీ నాయకత్వం విపరీతంగా ప్రచారం చేయడం విస్మయాన్ని కలిగిస్తుంది.ఈ పార్లమెంటు నియోజకవర్గంలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి కేడర్ కేవలం వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లోనే వుంది. మిగతా నియోజకవర్గాల్లో పెద్దగా లేదు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి 1లక్షా4వేల533 ఓట్లు వచ్చాయి. ఇందులో వరంగల్ తూర్పులో మాత్రమే బీజేపీ రెండో స్థానంలో వుంది. వరంగల్ పశ్చిమలో బీజేపీ మూడో స్థానంలో ఉంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి 52వేల105 ఓట్లు వచ్చాయి. పరకాల నియోజకవర్గంలో 38వేల 735 ఓట్లు రాగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 30 వేల 826 ఓట్లు వచ్చాయి. పరకాల నియోజకవర్గంలో బిజెపికి అధికంగా ఓట్లు రావడానికి ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి బీజేపీలో చేరి క్షేత్రస్థాయిలో ఆయనకున్న సంబంధాలన్నింటినీ టచ్‌లో పెట్టుకొని బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని ఓడించాలనే కసితో పని చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మొలుగూరి భిక్షపతి కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. ఆయన అనుచరులందరినీ ఇటీవలె కాంగ్రెస్‌లో చేర్పించారు. దీంతో పరకాల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వచ్చిన ఓట్లు వచ్చే అవకాశాలు తక్కువేనని పరిశీలకులు చెబుతున్నారు. 2009పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్య 1లక్షా6వేల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ టీఆర్ఎస్ అభ్యర్థి రామగళ్ల పరమేశ్వర్‌కు 2లక్షల71వేల210ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి దొమ్మాటి సాంబయ్యకు 1లక్షా35వేల 628, పిఆర్‌పి అభ్యర్థి డాక్టర్ రాజమౌళికి 1లక్షా8 వేల 331, బిజెపి అభ్యర్థి ఒంటేరు జయపాల్‌కు 35వేల999 ఓట్లు వచ్చాయి. 2014లో టీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం శ్రీహరి 3లక్షల90 వేల 378 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్యకు 2లక్షల68వేల450, బీజేపీ అభ్యర్థి డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్‌కు 1లక్షా86వేల 742 ఓట్లు వచ్చాయి. 2014లో పార్లమెంటు ఎన్నికల్లో జాతీయస్థాయిలో బీజేపీ హవా వున్నప్పుడు బీజేపీకి 1లక్షా86వేల 742 ఓట్లు రావడం గమనార్హం. 2019లో మోదీ హవా వున్నప్పుడు వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో టిఆర్ఎస్ అభ్యర్థి పసునూరి దయాకర్ 3లక్షల 50వేల భారీ మెజార్టీతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి దొమ్మాటి సాంబయ్యకు 2లక్షల 62 వేల 200 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి చింతా సాంబమూర్తికి 83వేల 777 ఓట్లు వచ్చాయి. బీజేపీకి అభ్యర్థి లేకపోవడంతో స్థానికేతరుడైన చింతా సాంబమూర్తిని బరిలోకి దింపారు.

పట్టు లేదు.. ప్రచారమే..


బీజేపీకి వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో పట్టు లేదని ప్రచారమే అధికంగా చేస్తుందన్న అభిప్రాయాలున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 1లక్షా 4 వేల 533 ఓట్లు వచ్చినా, బీజేపీ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించాలంటే మరో 4.5లక్షల నుండి 5 లక్షల ఓట్ల మేరకు సాధించాల్సి వుంటుంది. 2014లో బీజేపీ అభ్యర్థి డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్‌కు వచ్చిన ఓట్ల కంటే 2019లో బిజెపి అభ్యర్థి చింతా సాంబమూర్తికి ఓట్లు గణనీయంగా తగ్గాయి. ఏకంగా 1లక్షల ఓట్లు తగ్గడం గమనార్హం. దేశవ్యాప్తంగా బీజేపీ పెద్ద ఎత్తున ఓటింగ్ సాధించినా వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో మాత్రం ఓటింగ్ తగ్గింది. ఈ తాజా ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అర్థబలంపైనే ఆ పార్టీ నాయకత్వం ఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఇటీవలికాలం వరకు 'అరూరి' బీఆర్ఎస్‌లో పని చేయడంతో ఆ పార్టీ నేతలు కూడా సహకరిస్తారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ప్రచారం ఘనంగా ఉన్నా, కేడర్ లేకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది.

పార్టీ ఫిరాయింపులతో ఫలితమెవరికి..!

ప్రతిపక్షాల చూపు అధికార పార్టీ వైపేనా..

కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు...

వ్యూహ ప్రతివ్యూహాలల్లో పార్టీలు...



నవతెలంగాణ-వరంగల్

ఇటీవల మారిన రాజకీయ పరిణామాలలో వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తికావస్తుంది. అభ్యర్థుల ఉపసంహరణ అనంతరం మే నెల 13న పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఇప్పటికే వ్యూహ ప్రతి వ్యూహాలు రచించుకొని ప్రచారం ఎవరికి వారే ఓట్లను దక్కించుకోవడం కోసం ఓటర్లను కలుస్తూ ఉన్నారు. ఇది ఒక భాగమైతే ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకులు చేరడం చర్చనీయాంశంగా మారుతుంది. గతంలో చూసినట్లయితే నాయకులు, కార్యకర్తలు, నేతలు ఓడినా, గెలిచినా అదే పార్టీలో ఉంటూ తమ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడేవారు. కానీ గత ప్రభుత్వంలో కాంగ్రెస్ నుంచి ఎక్కువ మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లారు. అదే విధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా అదే తంతు కొనసాగుతున్నది. ఒక పార్టీ నుండి మరొక పార్టీలోకి నాయకులు చేరడం వల్ల ఎవరు ఏ పార్టీలో ఏ సమయంలో చేరుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఓటర్లు కూడా రాజకీయ నాయకులను నమ్మే పరిస్థితిలేదనే వాదనలు వినబడుతున్నాయి. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నిక విధానాన్ని పరిశీలిస్తే వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరినప్పటికీ ఎన్నికల్లో ఓటర్లు ఎవరూ ఊహించని రీతిగా తీర్పునిచ్చారు.

ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకులు తమ ఆస్తులను కాపాడుకునేందుకు, అక్రమాలు చేస్తున్న కొంతమంది రాజకీయ నాయకులు అధికార పార్టీలో ఉంటే వాటన్నింటిని సక్రమం చేసుకోవడం కోసం అడ్డూ అదుపు లేకుండా ఉంటుందని ఉద్దేశంతోనే భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. ఇదే కాకుండా ప్రలోభాలకు ఆశపడి అధికార పార్టీలో చేరేందుకు ద్వితీయశ్రేణి నాయకులు మొగ్గు చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కొంతమంది ఒక పార్టీలో ఉంటూనే వేరొక పార్టీకి కోవర్టుగా మారి అందుకు కారణం అవుతున్న వారు కూడా లేకపోలేదు. పార్టీ ఫిరాయింపుల వల్ల ఒక గందరగోళ వాతావరణాన్ని తీసుకురావడమే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరదని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటర్లు రాజకీయ నాయకులను చూసి ఓట్లు వేయడం లేదు. కానీ సరైన నాయకున్ని చూసుకొని ఓటర్లు ఓట్లు వేశారనే చర్చ శాసనసభ ఎన్నికల ఫలితాలను చూస్తే తెలుస్తుందనే వాదనలు వినబడుతున్నాయి. ఏదిఏమైనప్పటికీ ఇదే తంతు కొనసాగితే ప్రజలు ఏ పార్టీకి పట్టం కడతారో సందిగ్ధత ఓటర్లలో నెలకొని ఉంది. ఒక పార్టీ నుండి మరొక పార్టీలోకి చేరిన విషయాన్ని పరిశీలించినట్లయితే ఇటీవల ఎక్కువగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి ఎక్కువ మంది బీఆర్ఎస్ ప్రథమ, ద్వితీయ శ్రేణులు చేరడం పట్ల కాంగ్రెస్‌లో కొత్త కథనోత్సవం నింపుకుంటుందనే ప్రచారం మాత్రం కొనసాగుతుంది. శాసనసభ ఎన్నికల్లో మారిన రాజకీయ పరిణామాల దష్ట్యా బీఆర్ఎస్ పూర్తిగా విఫలం కావడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు పూర్తి అండదండలు లేకపోయేసరికి అగమ్యగోచరంగా మారడంతో పార్లమెంట్ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లోకి చేరితే కొంత గుర్తింపు ఉంటుందని, అందుకోసమే వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారా అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొంతమంది రాజకీయ నాయకులు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు చేదోడు వాదోడుగా ఉండి అన్ని తానే చూసుకున్న వారు సైతం ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడం పట్ల ఓటర్లు ఏమీ అర్థం కాక తలలు పట్టుకునే పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే కావాలనే బీఆర్ఎస్ వాళ్లే కాంగ్రెస్‌లోకి పంపిస్తున్నారా లేకుంటే తమ సొంత ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వస్తున్నారా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నత పదవులను పొందిన వారు కూడా కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నడం పట్ల ప్రజల్లో విస్మయం కలుగుతున్నది. ఇప్పటి వరకు కాంగ్రెస్‌లోకి వచ్చిన రాజకీయ నాయకులలో కొంతమంది భూ కబ్జాదారులు, మరి కొంతమంది స్వలాభాల కోసం పార్టీ మారుతున్నారని, ప్రజలకు సేవ చెయ్యాలనే ఉద్దేశంతో వివిధ పార్టీలో చేరడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ పార్టీలు మారినప్పుడు ప్రజల బాగోగుల కోసం మారి ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కషి చేస్తే బాగుంటుందని పలువురిలో చర్చ సాగుతోంది.

మొక్కలను సంరక్షించుకొనే బాధ్యత సిబ్బందిదే

హన్మకొండ డీఆర్ఓ గణేష్

నవతెలంగాణ-వరంగల్

ఈఎస్ఐ హాస్పిటల్ ఆవరణంలో మొక్కలను సంరక్షించుకునే బాధ్యత హాస్పటల్ సిబ్బందిదే అని హన్మకొండ డీఆర్ఓ గణేష్ అన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్‌లో 45వ ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా వరంగల్ ఈఎస్ఐ హాస్పిటల్ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం వరంగల్ ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ క్రాంతి సాగర్, సౌజన్యం లు మాట్లాడుతూ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్ సహకారంతో వెయ్యి మొక్కలు పెట్టాలనే లక్ష్యంతో సోమవారం వంద మొక్కలు నాటామన్నారు. మొక్కలను ఏపుగా పెంచుతామన్నారు.ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సాంకేతిక సహకారంతో ప్రారంభించి, కర పత్రం ఆవిష్కరణ, ప్రతి జ్ఞను చేయించిన మన్నారు.ఈ కార్యక్రమంలో పర్యావరణ పరి రక్షణ ఐక్య వేదిక అధ్యక్షులు పురుషోత్తం, శ్రవణ్ కుమార్, రామస్వామి, ఆనందరావు, ఆనంద్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో చేపట్టే పనులలో నాణ్యత ఉండాలి : కలెక్టర్ సిక్తాపట్నాయక్



నవతెలంగాణ-హనుమకొండ/ఎన్జీవోస్ కాలనీ

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే పనులు నాణ్యతగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం కాజీపేట మండల పరిధిలోని కాజీపేట, న్యూ శాయంపేటల్లోని ప్రభుత్వ పాఠశాలలను మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసికలెక్టర్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను పరిశీలించారు. పనులకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ పాఠశాలల్లో అభివద్ధి పనులను నాణ్యంగా చేపట్టడంలో కమిటీలు కషి చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని పనులను పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఈ పాఠశాలల్లో కేటాయించిన పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యంతో పాటు, తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపు, వీల్ ఛైర్, తదితర సదుపాయాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, తహశీల్దార్ బావ్‌సింగ్, ఈఈ రాజయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులకు ఎన్నికల కోడ్ వర్తించదా ?

నవతెలంగాణ-దామెర

పార్లమెంట్ ఎన్నికల దష్ట్యా ఎన్నికల కోడ్ వర్తించదన్నట్లు జోరుగా బెల్ట్ షాపుల దందా కొనసాగుతూనే ఉంది అదుపు చేయాల్సిన ఎక్సైజ్ శాఖ మద్యంమత్తుతో తూలుతున్నట్లుగా ఉంది. మండలంలో 14 గ్రామాలకుగాను ఒక గ్రామంలో ప్రజలు మద్యనిషేదం అమలు చేస్తుండగా మిగతా 13 గ్రామాల్లో బెల్టుషాపుల దందా 24గంటలు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలో లైసెన్స్‌కలిగిన రెండు వైన్ షాపులు ఉన్నాయి. వాటికి అనుబంధంగా అమ్మకానికి బెల్ట్‌షాపులు కొనసాగుతూనే ఉన్నాయి. అడపాదడపా పోలీసులు దాడిచేసి మద్యం పట్టుకున్నప్పటికీ ఇంకా మిగతా గ్రామాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికలు మొదలైనప్పటినుండి ఎన్నికల కోడ్ వచ్చి నెల రోజులైనప్పటికీ అధికారులు అదుపు చేయడం లేదని ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అసలు బెల్ట్ షాపులను అదుపు చేయాల్సిన ఎక్సైజ్ శాఖ కన్నెత్తి చూడకపోవడం మామూళ్ల మత్తులో తూగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలదృష్ట్యా ఓటర్లను మద్యం ప్రభావితం చేస్తాయనడంలో ఏమాత్రం సందేహం లేదు. యువత మద్యంమత్తులో అర్ధరాత్రి వరకు మద్యం సేవిస్తూ ఎన్నికల రాజకీయ విషయాలు మాట్లాడుతూ తమ రాజకీయ పార్టీ గొప్ప అని చెబుతూ చేస్తున్న గొడవలతో బెల్ట్ షాపుల వారి పక్కఇండ్ల వారు నిద్రలేమి రాత్రులు గడుపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అక్రమ దందాను అరికట్టి ప్రజాస్వామ్యంలో ఎన్నికల కోడ్‌ను అపహాస్యం చేయకుండా చూడాల్సిన సంబంధిత అధికారులు మేల్కొవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలి



నవతెలంగాణ-హన్మకొండ

రాష్ట్రంలో వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీ కి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని వరంగల్ పార్లమెంట్ ఇండిపెండెంట్ అభ్యర్థి ఎస్పీకే సాగర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి గత పదేళ్లుగా కష్టపడుతున్న కార్యకర్తలను కాదని రాత్రికి రాత్రే పార్టీలు మారుతున్న రాజకీయ నాయకుల కుమారులు, కూతుళ్ళకు టికెట్ కేటాయించి మాలాంటి నిజమైన కార్యకర్తలకు అన్యాయం చేస్తుందని ఇలాంటి వారసత్వ రాజకీయాలకు నాంది పలుకుతున్న కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నాలాగా వరంగల్ పార్లమెంటు సీటును ఆశించి దొమ్మటి సాంబయ్య, అద్దంకి దయాకర్, అలాగే ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన మోత్కుపల్లి నరసింహులు లాంటివారికి టికెట్లు కేటాయించకుండా రాత్రికి రాత్రే డబ్బులకు అమ్ముడుపోయి పార్టీ మారిన కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు టికెట్ కేటాయించడం దారుణమన్నారు. 40 ఏళ్ల రాజకీయాల్లో అధికారంతోపాటు అనేక పదవులు అనుభవించిన శ్రీహరికి ఇంకా అధికార వ్యామోహం తీరలేదని విమర్శించారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తూ అనేకమంది రాజకీయ నాయకుల కుమారులు, కుమార్తెలకు టికెట్లు కేటాయించి పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు తీవ్ర అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీకి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఓడించాలని పిలుపునిచ్చారు.

అక్రమ వసూళ్లపై విచారణ చేయాలి



నవతెలంగాణ-హన్మకొండ

గత కొన్ని సంవత్సరాల నుండి వరంగల్ జిల్లాలోని రంగంపేట పురాతన మసీదులో దీర్ఘకాలంగా జరుగుతున్న అవినీతి వసూళ్లపై విచారణ చేయించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని రంగంపేటవాసులు, మైనారిటీ నాయకులు మహమ్మద్ ఖలీల్ అహ్మద్, కాజా పాషా, ఇమ్రాన్ పాష, గౌస్, ఇక్బాల్ పాషా, మహమ్మద్ అలీ, ఎస్.కె షఫియోద్దీన్ ,అబ్దుల్ మసూద్, ఫజల్, ఎస్‌కె.ముస్తఫా, ఎండి.యూసఫ్ డిమాండ్ చేశారు. సోమవారం వారు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా వరంగల్ రంగంపేట పాతసెంట్రల్ జైలు ఎదురుగా ఉన్న మసీదులో మాజీ కమిటీ గడువు ముగిసినా తమకు తామే మసీదు కమిటీ సభ్యులం అని చెప్పుకుంటూ అమాయక బస్తీప్రజలను మోసం చేస్తూ మసీదు మెయింటెనెన్స్ , మసీదు నిర్మాణ పనుల పేరిట దొంగ రిసిప్ట్ బుక్కులు ప్రింట్ చేయించి లక్షలాది రూపాయలు వసూలు చేస్తుండడంతో మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసుఅధికారులు విచారణ చేయకుండా దరఖాస్తు బుట్ట దాఖలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆ కాలనీ పెద్దలు పాత కమిటీ చేస్తున్న మోసాన్ని పైఅధికారులకు తెలియజేయడానికి సోమవారం జిల్లా కలెక్టర్, సిపికి వినతి పత్రం అందించామని అవినీతికి పాల్పడుతున్న పాత కమిటీ సభ్యులు మాసూమ్ సిద్ధికి, ఇస్మాయిల్, సుభాని, అత్తర్, అబ్దుల్ చాంద్‌కాం తదితరులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నవతెలంగాణ-హనుమకొండ

లోకసభ ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న తమ ఎన్నికల ప్రణాళికలలో చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను చేర్చాలని బీసీహక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. 77 ఏళ్ల స్వాతంత్రానంతరం కూడా దేశంలో బీసీ,ఎస్సీ, ఎస్టీ, పీడిత తాడిత వర్గాలు అణచివేతకు గురవుతున్నారన్నారు. బీసీలు సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, వ్యాపార, వాణిజ్య మొదలైన అన్ని రంగాల్లో వెనుకబడి ఉండటానికి రాజ్యాధికారంలో సరైన వాటా లేకపోవడమే ప్రధానమైన కారణమన్నారు. దేశ జనాభాలో 56 శాతానికి పైగాఉన్న బీసీలు చట్టసభలలో సరైన ప్రాతినిధ్యానికి నోచుకోలేదన్నారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన జరగాలని ,చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించాలని అనేక ఉద్యమాలు జరుగుతున్నా కేంద్రంలో ప్రధానమంత్రి మోడీ సర్కార్ నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిం చడం శోచనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా బీసీలు, అణగారిన వర్గాల ప్రజలందరూ చైతన్యంతో సంఘటితమై డిమాండ్ల సాధన కోసం రాబోవు కాలంలో లక్ష్యాలను సాధించేదాకా బలోపేతమైన ఉద్యమాలు నిర్మించేందుకు ఎలాంటి త్యాగాలకైనా సంసిద్ధంకావాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

శ్రీనివాస్‌కు నాయకుల నివాళి



నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మామిడి శ్రీనివాస్ గుండెపోటుతో బాధపడుతూ ఆదివారం రాత్రి మరణించాడు. సోమవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి మృతుడి చిత్రపటానికి నివాళులర్పించగా శ్రీనివాస్ భౌతికకాయానికి ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్‌లు కందగట్ల రవి, అబ్బు ప్రకాష్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది మామిడి రుపేందర్, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ముల‌భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, మారపల్లి రవీందర్, కొమ్ముల శివ, పొడిశెట్టి గణేష్, మేరగుర్తి కర్ణాకర్, గిద్దెమారి రామన్నలు పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం : అదనపు కలెక్టర్



నవతెలంగాణ-సుబేదారి

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధమని అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఓటు చైతన్యంపై స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాల ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ ఓటరు అవగాహనర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్ట్స్ కళాశాల నుండి కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు తప్పకుండా ఓటు వేయాలని పేర్కొన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేయాలన్నారు. ఓటర్లు తమ పక్కనున్న ఓటర్లను కూడా తప్పకుండా ఓటువేసే విధంగా కృషిచేయాలి అన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కళాకారులు ఓటరు చైతన్యంపై పాటలు పాడి ఆకట్టుకున్నారు. కలెక్టరేట్ ముందు కోలాటం ఆడి సందడి చేశారు. కొండ సారంగపాణి బృందం ఆలపించిన ఓటుఅమ్మ ఓటు, జాజిరిజాజిరి ఓయమ్మా పాటలకు ట్రాన్స్ జెండర్లు, సీనియర్ సిటిజెన్లు, కోలాట బృందాలు నత్యం చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో తప్పకుండా ఓటువేస్తామని ప్రతిజ్ఞచేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ, స్వీప్ నోడల్ అధికారి నాగపద్మజ, అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాసరావు, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, డీడబ్ల్యుఓ మధురిమ, సీపీఓ సౌరం ప్రవీణ్ కుమార్, స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఐకాన్ లైలా, ట్రాన్స్ జెండర్లు, సీనియర్ సిటిజన్లు,దివ్యాంగులు, స్వయం కృషి కోలాటబృందం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటా : కేఆర్.నాగరాజు



నవతెలంగాణ-నయీంనగర్

కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ప్రతీ కార్యకర్తను కంటిరెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పేర్కొన్నారు. సుబేదారి ఎమ్మెల్యేక్యాంప్ కార్యాలయంలో సోమవారం 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు పల్లకొండ సరోజన, బీఆర్ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ గొర్రెసతీష్, యూత్ నాయకులు చుంచు శ్రవణ్ ఇమ్మడి రాజీవ్, దేవునూరి కిశోర్‌తోపాటు 100మంది యువకులు, మహిళలకు అందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఎమెల్యే నాగరాజు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మొన్నటి ఎన్నికల వరకు ప్రజలను మోసపూరిత మాటలతో మభ్యపెడుతూ కాలం వెల్లదీశారన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని తెలిసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాతకొత్త అనే విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారితో గెలిపించి వరంగల్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయాలి అని వారు కోరారు..

ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు కందుకూరి పూర్ణచందర్, చింత రమేశ్‌గౌడ్, కసాగోని జనార్దన్‌గౌడ్, రుద్రోజు మనింద్రణాత్ , జనుప సారంగపాణి, భుక్యా శంకర్ నాయక్ , భూక్యా విజయ్‌కుమార్, బీరం రవీందర్ రెడ్డి , పులిచేరు రవీందర్ పల్లకొండ విజయ్ సూర్య, మహిళా నాయకులు అన్నా విజయ , శనిగిరపు అనిత, గొడిశాల సంధ్యా, గూగులోతు స్వరూప , శ్రవంతి, స్వప్న తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యూత్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బహిరంగ సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

ఏప్రిల్ 24న కాజీపేట మండలం మడికొండ సమీపంలో నిర్వహించనున్న వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ భారీబహిరంగ సభాస్థలాన్ని పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సోమవారం పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరువనున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లపై చర్చించారు. సభ ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూడాలని నేతలకు సూచించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు భారీగా తరలివచ్చి బహిరంగ సభను విజయవం తం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



టీపీఎఫ్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



నవతెలంగాణ-హనుమకొండ

మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా ఈనెల 28న టీపీఎఫ్ ఆధ్వర్యంలో జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ కో-కన్వీనర్ బి.రమాదేవి పిలుపునిచ్చారు. మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా టీపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సుకు ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ రాచమోని నాగభూషణ్ అధ్యక్షత వహిస్తారని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ , హరగోపాల్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ ప్రొఫెసర్ చింతకింది కాసిం, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ ఏ నరసింహారెడ్డి తదితరులు ప్రసంగిస్తారని ఆమె తెలిపారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో భారత్ బచావో నాయకులు వెంగల్ రెడ్డి, చైతన్య మహిళా సమాఖ్య నాయకురాలు కళ, టీపీజాక్ కోకన్వీనర్ ప్రవీణ్ ,టీపీఎఫ్ నాయకులు గద్దల సంజీవ, పౌర హక్కుల సంఘం నాయకులు జయంత్, సదానందం, సుదర్శన్‌రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పరకాల 108 సిబ్బందికి అవార్డు



నవతెలంగాణ-సుబేదారి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసులో 2023 -24 సంవత్సరానికి గాను ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లాలోని పరకాల 108 సిబ్బంది ఎంపికైనట్లు ప్రోగ్రాం మేనేజర్ శివ కుమార్ తెలిపారు. నవంబర్‌లో కంతాత్మకూర్ చెందిన వ్యక్తి సూసైడ్ ప్రయత్నం చేసుకోగా ,సమయానికి సంఘటన స్థలానికి చేరుకొని తగు ప్రాథమిక చికిత్స చేసి ప్రాణాపాయ స్థితి నుండి కాపాడిన పరకాల 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వక్కల సంజీవ్,పైలట్ పాముల రాజు అవార్డుకు ఎంపికయ్యారన్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ ,స్టేట్ ఆపరేషన్ హెడ్ ఖలీద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు పీఎం శివకుమార్, హనుమకొండ జిల్లా ఇన్చార్జి లక్ష్మణ్ అభినందనలు తెలియజేశారు.

తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాల్సిందే

- ఎన్నికల్లో లబ్దికే రూ.2 లక్షల రుణమాఫీ నాటకం
- ఎంపీ బండి సంజయ్ కుమార్



నవతెలంగాణ-ఎల్కతుర్తి

అకాలవర్షంతో తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చే యాల్సిందేనని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంజయ్ పరిశీలించగా కొనుగోలులో పెద్దఎత్తున కటింగ్ పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టక పో వడంతో రూ.500లు తక్కువగా దళారులకు అమ్మాల్సివస్తోందన్నారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలవల్ల చాలా ప్రాంతాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారి బాధలు తెలుసుకునేందుకే ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు. వర్షానికి కొంత ధాన్యం తడిస్తే వడ్లన్నీ తడిశాయంటూ క్వింటాల్‌కు 10కిలోల దాకా కోత పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను మోసం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వం ప్రకటనలు పేపర్లకే పరిమిత మవుతున్నాయని విమర్శించారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మే నిఫెస్టోలో హామీ ఇచ్చి నెరవేర్చడం లేదని మళ్లీకొత్తగా రూ.2 లక్షల రుణ మాఫీ అంటూ కొత్త నాటకానికి తెరతీశారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి, బొమ్మ శ్రీరా మచక్రవర్తి, కుడితాడి చిరంజీవి, మన్నుర్తి శ్రీకాం త్‌యాదవ్, రాంగోపాల్ రెడ్డి, డాక్టర్ దేవేందర్ రెడ్డిలు ఉన్నారు.

అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన లెనిన్

నవతెలంగాణ-హన్మకొండ

పేదరికం, మతం, జాతి, వర్గ అసమానతలు లేని దోపిడి రహిత సమాజం కోసం పరి తపించిన కమ్యూనిస్టు ప్రపంచ మహానేత లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో రష్యా విప్లవ నేత లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాధితుడికి ఎమ్మెల్సీ పరామర్శ

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని కొత్తగట్టుసింగారంకు చెందిన తోట శరబంధం అనారోగ్యంతో బాధపడుతుండగా సోమవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి సందర్శించి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రాణకోటికి ఆధారమైన భూమిని కాపాడుకోవాలి



నవతెలంగాణ-సుబేదారి

సమస్త ప్రాణకోటికి ఆధా రమైన భూమిని కాపాడుకో వా ల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రపం చ ధరిత్రి దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పాటు పర్యావరణానికి పెనుముప్పును కలిగించే అనర్థాలను నియంత్రించినప్పుడే ధరిత్రి బాగుంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్లో ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంలో అధికారులు, సిబ్బంది కృషిచేస్తున్నారన్నారు. ప్లాస్టిక్ నియంత్రణతో పాటు తడి, పొడి చెత్త నిర్వహణ పట్ల అవగాహ నఅవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఆర్డిఎ ఆధ్వర్యంలో పర్యావర ణ హితమైన సంచులను కలెక్టర్ చేతుల మీదుగా వివిధ శాఖల అధికారులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, వెంకట్ రెడ్డి, ఐటీడీఏ పీవో చిత్రామిశ్ర, డిఆర్‌ఓ వైవి.గణేష్, డిఆర్డిఓ నాగపద్మజ, డీడబ్ల్యు ఓ కె.మధురిమ, అదన పు డిఆర్డివో శ్రీనివాసరావు, జెడి రవీందర్‌సింగ్, జిల్లా సహకార శాఖ అధికారి నాగేశ్వరరావు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్. ప్రవీణ్ కుమార్, జిల్లా స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ పసునూరి సంపత్ కుమార్,ఇతర అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు అండగా ఉంటా : ఇనగాల



నవతెలంగాణ-ఆత్మకూరు

యువతకు అండగా ఉంటానని వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని ఇనగాల నివాసంలో మండలానికి చెందిన పలువురు యువకులు ఇనగాలను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో యువతకు పెద్దపీట వేస్తామని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగ కల్పనకు కృషిచేస్తానని సూచించారు. దేశాభివద్ధిలో యువతపాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో తనుగుల సంపత్,శ్రీశైలం, దుగ్యాల కిరణ్,మణికంఠ,గుర్రంఅజయ్, శ్రీకాంత్, మోహన్, రమేష్‌లు పాల్గొన్నారు.

నేత్రాలను సురక్షితంగా కాపాడుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట

నేత్రాలను సురక్షితంగా కాపాడుకోవాలని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో పెద్దపల్లి రామ్మూర్తి అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి, సూరంపేట గ్రామాల్లో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ హనుమకొండ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గ్రామపంచాయతీ కార్యాలయాలలో సోమవారం నిర్వహించగా రామ్మూర్తి పాల్గొని ప్రారంభించి మాట్లాడారు.ఈ శిబిరంలో 110 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించగా, 32 మందికి శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శిబిరం ఇన్చార్జి కో-ఆర్డినేటర్ వంశీ, సాగర్,శైలజ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ ఇన్నారెడ్డి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అక్కల రమేష్, కుక్కల కల్పన, పల్నాటి రాంబాబు, మనోహర్‌లు పాల్గొన్నారు.

నేడు ఉచిత రుమటాలజీ వైద్యశిబిరం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

నేడు హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వ హించనున్నట్లు నిర్వాహకుడు మధుకర్ తెలిపారు. సీనియర్ రుమటాలజిస్ట్ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్న వైద్య శిబిరంలో రూ.2వేల విలువైన ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. మోకాళ్లు, కీళ్లు, నడుము, మెడ తదితర నొప్పులతో బాధపడేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 7893588057 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ఆత్మకూరు

ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ విలాసాగరపు రాజు తల్లిదండ్రులకు రాజుతో కలిసి ట్రైనింగ్ పూర్తి చేసుకున్న 1998 సంవత్సరం ఏఆర్ కానిస్టేబుల్ బ్యాచ్ మిత్రులు రూ.1.42లక్షల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజు కుటుంబానికి అన్నివిధాల అండగా ఉండి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ కమలాకర్ యాదగిరి, శ్యాంసుందర్, శంకర్ సాంబయ్య, శుభంకర్ రాజేందర్ రాము, ప్రేమ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

నవతెలంగాణ-హన్మకొండ

లంచం తీసుకుని సస్పెండ్ అయిన సబ్‌రిజిస్ట్రార్ తస్లీమాకుగల హనుమకొండలోని ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-కొడకండ్ల

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధారావత్ సురేష్ నాయక్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో యశస్విని రెడ్డికి ఎంతైతే మెజార్టీ ఇచ్చారో అదే రీతిలో కడియం కావ్యకు అత్యధిక ఓట్లు వేసి ప్రతిపక్ష పార్టీలకు దిమ్మతిరిగేలా గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అమలుపరుస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసే సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి : ఎంపీపీ జ్యోతి



నవతెలంగాణ-కొడకండ్ల

వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో ప్రజల దాహం తీర్చేందుకు అధికారులు సమన్వయంతో పని చేస్తూ తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీ ద్వారా జ్యోతి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు గిరిజన తండాల్లో హరిజన కాలనీలో పర్యవేక్షణ చేస్తూ తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజలకు సకాలంలో త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి సూరి, తహసీల్దార్ అంజయ్య, వివిధ గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, అధికారులు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నేలపోగులలో కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలం నేలపోగుల గ్రామంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలాధ్యక్షుడు శివకుమార్, మండల ఇంచార్జి సదానందం, జెడ్పీటీసీ వంశీధర రెడ్డి, మండలంలోని సీనియర్ నాయకులు హాజరయ్యారు.మొన్నటి వరకు టీఆర్ఎస్ పార్టీలోఉండి 10 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులకు గురి చేసిన వారు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీలో చేరినటువంటి దూసరి గణపతిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని వ్యతిరేకించిన సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి ఎంపిటిసి గుగ్గిల నర్సయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. గ్రామంలోని పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు చాలామంది నిరసన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని చేర్చుకోవద్దనిచెప్పి మీటింగ్‌లో మధ్యలోనే కార్యకర్తలు జోగు రాజు,జోగు ఆంజనేయులు, గోగు కొమురయ్య, గుగిల్ల అబ్బాయిలు,జనగాం నరసింహ,గుగిల్ల రామచెందురు, సత్తయ్య,నాగరాజు, మహేందర్, ఉప్పలయ్య, నాగేష్, క్రిష్ణ, సత్తయ్య చాలామంది కార్యకర్తలు వెళ్లిపోయారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వర్గం కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

గాలి వానతో నష్టం...



నవతెలంగాణ-కొడకండ్ల

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సానికి మండలంలోని లక్ష్మక్కపెల్లిగ్రామంలో వాంకుడు సేవ్ కోళ్ల షెడ్డు పై కప్పు లేచిపోవడంతో కొన్ని కోళ్లు చనిపోయాయని, మొండ్రాయి గ్రామంలో వరి నేలవాలడంతో పాటు పలు గ్రామాల్లో పంట నష్టంజరిగింది. అధికారులు చర్యలు తీసుకొని బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రీ ప్రైమరీ అన్యువల్ సెలబ్రేషన్స్



నవతెలంగాణ-తరిగొప్పుల

మండల పరిధిలోని అబ్దుల్ నాగారం గ్రామంలో గల అంగన్వాడి ఒకటి, రెండవ కేంద్రాలలో ప్రీ ప్రైమరీ అన్యువల్ డే సెలబ్రేషన్స్ సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ వసంత పాల్గొని మాట్లాడారు. పిల్లలకు స్కూల్ లాస్ట్ రోజులో సంవత్సరం మొత్తం నిర్వహించినవి పిల్లలతో చేపించి తల్లులకు చూపించారు. ఏప్రిల్ నెలలో జరిగే అన్యువల్ డేలో పిల్లలతో డాన్సులు చేపించారు. మూడు నెలలకు ఒకసారి అసెస్మెంట్ పిల్లలకు స్టార్స్ గుర్తించి వారికి ప్రోగ్రెస్, ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు రేణుక, మంజుల.ఆయాలు సుజాత, బాలమణి, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-కొడకండ్ల

మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కుందూరు అమరేందర్ రెడ్డి తల్లి పూల దేవి అనారోగ్యంతో బాధపడుతూ ఉదయం మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు ధారావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సోమ నర్సయ్య, పట్టణాధ్యక్షుడు రవీందర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ వనం మోహన్, అంజయ్య, రంగయ్య, సతీష్, కనకయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు పయనమైన హనుమాన్ భక్తులు



నవతెలంగాణ-రఘునాథపల్లి

మండల కేంద్రంలోని శ్రీ మహదేవ స్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారం హనుమాన్ దీక్ష భక్తులు ఆలయ అర్చకులు పిండిప్రోలు శ్రీనివాస్ శర్మ నేపథ్యంలో ఇరుముడితో రఘునాథపల్లి నుండి కొండగట్టు పుణ్యక్షేత్రానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాలధారణ వేసుకున్న స్వాములు కందుల అనిల్ కుమార్, కొన్నే సతీష్, కోళ్ల సందీప్, పెర్నె అనిల్, శ్రీ మహదేవ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కూరెళ్ళ పెద్ద ఉపేందర్ గుప్తా, బచ్చు చిరంజీవి గుప్తా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోళ్ల రవి గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు పేర్ని ఉషా రవి దంపతులు, పద్మశాలి యువజన సంఘం జిల్లా నాయకులు కరీంకొండ ప్రదీప్ కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం



నవతెలంగాణ-లింగాలఘనపురం

బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ భూలోపేతానికి కృషి చేయాలని జెడ్పిటీసీ వంశీధర్ రెడ్డి, మండలాధ్యక్షుడు శివకుమార్, మండల ఇన్చార్జి సదానందం కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని పటేల్ గూడెం, కుందారం, కిష్టగూడెం, చిటూరు, నేలపోగుల, వనపర్తి గ్రామాలలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సనాహక సమీక్ష సమావేశాలు ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి కార్యకర్తల నుంచి ఓట్లు రాబట్టాలని, వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ అధిష్టానానికి కట్టుబడి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లారెడ్డి, బాబు, దిలీప్ రెడ్డి, మండల నాయకులు రమేష్, నాగరాజు, బి.రమేష్, అనిల్, సంపత్, నాగేందర్, రాజు, మోహన్ పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన నాయకులు

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్ కుమార్ నామినేషన్ దాఖలు చేసిన కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య, సుధీర్, భాగ్యలక్ష్మి శ్రీవారి, కనకయ్య, ప్రభాకర్, సోమిరెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ గేటుకు తాళం వేయడం సిగ్గుమాలిన చర్య

- రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన, అరెస్ట్, విడుదల



నవతెలంగాణ-జనగామ

రైతుల వ్యవసాయ ఉత్పత్తులు అమ్మేందుకు ఏర్పాటుచేసినజనగామ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు అధికారులు తాళం వేయడం సిగ్గు మాలినతనమని రైతులు రైతు సంఘాల నాయకులు మండిపడ్డారు. గత వారం రోజులుగా జనగామ జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డుకు అధికారులు తాళం వేశారు. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం కొనుగోలు నిలిచిపోయాయి.ప్రధానంగా ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రధాన గేటు వద్ద రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రధాన గేటు వద్ద బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. గేటు తీసేంతవరకు తొలిగేది లేదని భీష్మించి కూర్చున్నారు. వీరికి తోడుగా తమ పని కోల్పోయి రోడ్డునపడ్డామని మార్కెట్ యార్డ్‌లో పనిచేసే హమాలీలు, చాటావాలా, దడువాయి, కూలీలు ఆందోళనకు సంఘీభావం తెలిపారు. గేటు తెరిచి ధాన్యంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లో అమ్ముకోవడానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమం వద్దకు జిల్లా మార్కెటింగ్ అధికారి రమేష్‌తో పాటు జనగామ వ్యవసాయ మార్కెట్ ఇన్చార్జి సెక్రెటరీ శ్రీనివాసులు వచ్చి ఎంత నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా రైతులు వినకుండా ఆందోళన నిర్వహించారు. ఈ క్రమంలో జనగామ సీఐ రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని లాగి పడేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రైతు సంఘం నాయకులకు పోలీసులకు తీవ్ర వాగ్వావాదం చోటుచేసుకుంది. గేటు తీసేంతవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు.దీంతో పోలీసులు రైతు సంఘం, సీపీఎం నాయకులను అరెస్టు చేసి ఈడ్చుకుంటూ లాక్కెళ్ళి పోలీసు వాహనంలో వారిని జనగామ పోలీస్ స్టేషనుకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు మోకు కనకా రెడ్డి, చందునాయక్, మంగ బీరయ్య, మిత్య నాయక్,వెంకట మల్లయ్య, ధర్మభిక్షం తదితరులు ఉన్నారు. అనంతరం వీరిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు మోకు కనకా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ మాట్లాడుతూ జనగామ వ్యవసాయ గ్రేన్ మార్కెట్ గేటుకు గత 15 రోజులుగా వేసిన తాళం తెరిచి రైతులు పండించిన అన్ని రకాల పంటలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లో గత 15 రోజుల క్రితం ప్రైవేటు వ్యాపారస్తులు మద్దతు ధర పెట్టడం లేదని అధికారులు ఏకంగా మార్కెట్ యార్డ్‌కు తాళం వేయడం సరైనది కాదన్నారు. వ్యాపారం చేసుకోవడానికి లైసెన్సులు ఇచ్చే అధికారులు చెబితే వ్యాపారస్తులు వినకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గతవారం రోజులుగా మార్కెట్లో రైతుల ధాన్యం అమ్మకం నిలిచిపోవడంతో రైతుల అవస్థలు పడుతున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మిల్లులలో, చిల్లర కంటాదారులకు తక్కువ ధరలకు క్వింటాలుకు రూ.1600లకు వడ్లను అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. డబ్బులు అత్యవసరం ఉన్న రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాల్సింది పోయి మార్కెట్‌కు తాళం వేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. వారం రోజులుగా మార్కెట్ పై ఆధారపడి జీవిస్తున్న హమాలీ, దడువాయి కార్మికులు, చీపురు మహిళలు కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కావున కార్మికులకు ఒక్కొక్కరికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ యాసంగి సీజన్లో నీటిమట్టం పడిపోయి సుమారు 30 శాతం పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.గత మూడు రోజుల నుండి అకాల వర్షాల వలన జిల్లా పరిధిలో ధాన్యం తడిసి ముద్దయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఎటువంటి షరతులు లేకుండా త్వరితగతిన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వాతావరణ వర్షాభావ పరిస్థితుల రీత్యా అప్పటికప్పుడు వరి కోయించి తెచ్చిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు మార్కెట్లో కొనే విధంగా ట్రేడర్స్ ఆలోచన చేసి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం ఆధ్వర్యంలో జనగామ జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మార్కెట్లో విక్రయించుకునే విధంగా అన్ని విధాలుగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పొత్కనూరి ఉపేందర్, తెలంగాణ అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులు ఆది సాయన్న, చొప్పరి సోమయ్య, నాయకులు బోడ రాములు, ఆనందం, హమాలీ కార్మిక సంఘం నాయకులు గుండెల్లి రాజు, కురాకుల శ్రీనివాస్, రైతులు, దడవాయి సంఘం కార్మికులు పాల్గొన్నారు.

జహంగీర్ గెలుపు... అభివృద్ధికి మలుపు...





- కమ్యూనిస్టుల గెలుపు... ప్రజా పోరాటాల గెలుపు
- సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్

నవతెలంగాణ-జనగామ

భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి జహంగీర్ గెలుపు భువనగిరి అభివృద్ధికి మలుపు లాంటిదని సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్ అన్నారు. సోమవారం జనగామ జిల్లా పసరమడ్ల గ్రామంలో జహంగీర్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని పిలుపు నిచ్చారు. వామపక్షాల బలాన్ని పెంచాలని, కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకికవాదప్రభుత్వం ఏర్పడేలా ప్రజలు ఆలోచించాలని సీపీఎం పిలుపు నిచ్చిందని తెలిపారు. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దశాబ్ద కాలంగా సాగించిన పాలనతో లౌకికవాద,ప్రజాస్వామ్య, భారత రిపబ్లిక్ ఉనికే ప్రమాదంలో పడిందన్నారు.ఈ నేపథ్యంలో 2024 లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రభుత్వ యంత్రాంగాన్ని, పార్లమెంట్‌లో తనకున్న మెజారిటీని దుర్వినియోగం చేస్తూ, నిరంకుశవాద, మతోన్మాద మోడీ ప్రభుత్వం దేశంలోని కార్మికుల హక్కులను నాశనం చేసేందుకు ఫాసిస్ట్ పద్ధతులను ఉపయోగిస్తుందని విమర్శించారు. ప్రజలను మతపరంగా విభజించేందుకు విషపూరితమైన తన మతోన్మాద సిద్ధాంతాలను ప్రయోగిస్తోందని అన్నారు. ఈ ఎన్నికలను ఉపయోగించుకొని బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడించడమే ప్రతి దేశభక్తుని కర్తవ్యంగా భావించాలని కోరారు.ఈ క్రమంలో కమ్యూనిస్టుల గెలుపు ప్రజా పోరాటాల గెలుపు భావించవచ్చు అన్నారు.అందుకోసం ప్రతీ కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ సీపీఎం విధానాలను ప్రజలవద్దకు తీసుకెళ్ళి అభ్యర్థి యండి జహంగీర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, గ్రామ శాఖ కార్యదర్శి మల్లేష్, యాదయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

జహంగీర్‌ను గెలిపించాలి...మతోన్మాద బీజేపీని ఓడించాలి : సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య

భువనగిరి నియోజకవర్గం సీపీఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈర్రి అహల్య పిలుపు నిచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామ పట్టణంలో లక్ష్మీభాయ్‌కుంట, గిర్నిగడ్డ ఏరియాలో జహంగీర్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్య మాట్లాడుతూ సీపీఎం అభ్యర్థి గెలిస్తేనే పార్లమెంట్‌లో ప్రజావాణిని వినిపించడానికి అవకాశం ఉంటుందని, వామపక్షాల బలం తగ్గడం వలన ప్రజా సమస్యలు పక్కకు పోయి కార్పోరేట్లకు ఉపయోగపడే విధానాలు ముందుకు వస్తున్నాయని అన్నారు. 10 ఏళ్ల బిజెపి పాలనలో కార్పొరేట్ మతోన్మాద విధానాలు బలపడ్డాయని వీటికి వ్యతిరేకంగా నికరంగా పోరాడింది దేశంలో వామపక్షాలే అని, వామపక్ష అభ్యర్థులు గెలిస్తే ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తేవడానికి అవకాశం ఏర్పడుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శిలు ఎండి గౌసియా, ఎండి నాజియా, మారేడు వినోద్, భాగ్యలక్ష్మి, యాదలక్ష్మి, సునీత, యాదమ్మ, సుజాత, రేణుక, ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-కొడకండ్ల

ఆదివారం రాత్రి ఈదురు గాలితో కూడిన వానలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షులు పులిగిల్ల ఉపేందర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ అంజయ్యకుసోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, వరి, మామిడి తోట నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి 30 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా కరాటే ప్రధాన కార్యదర్శిగా సంతోష్ కుమార్



నవతెలంగాణ-జనగామ

జనగామ జిల్లా విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ జనరల్ సెక్రెటరీగా మాస్టర్ ఓరుగంటి సంతోష్ కుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు ఇండియా చీఫ్ గ్రాండ్ మాస్టర్ రంగు మల్లికార్జున్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాదులోని చిలకనగర్ లోని నోవా బ్యాంకెట్ హాల్లో ఇండియా చీఫ్‌గ్రాండ్ మాస్టర్ రంగు మల్లికార్జున్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఓరుగంటి సుదర్శన్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ జనగామ జిల్లా వ్యాప్తంగా మార్షల్ ఆర్ట్స్, కరాటే విద్యలను గ్రామ గ్రామాన బలోపేతం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వియస్‌కెఐ ప్రెసిడెంట్ మేకల సత్య నారాయణ, చైర్మన్ సదాశివుడు, సెక్రెటరీలు వెంకటేష్, శ్రీనివాస్, సీనియర్ మాస్టర్లు అశోక్, బాబూరావ్, సురేష్,సంజయ్, ప్రసాద్, మహేష్, మల్లేష్, కిరణ్ నాయక్, బోధకులు కార్తీక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్ - నగదు, ద్విచక్రవాహనం స్వాధీనం

జనగామ : గత మార్చి చివరి వారంలో జనగామ పట్టణంలో కారు అద్దాలు పగలగొట్టి రూ. 2 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగ హరీష్‌ను జనగామ పోలీసులు అరెస్టు చేశారు. దొంగ నుండి రూ. 2 లక్షల రూపాయలు, రాయల్ ఎన్ఫీల్డ్ ద్విచ క్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో డీసీపీ సీతారాం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన హరీష్, నిఖిలేష్‌లు మార్చి చివరి వారంలో జనగామకు చెందిన వ్యక్తి ఐసిఐసిఐ బ్యాంకు నుండి రెండు లక్షల రూపాయలు డ్రా చేసుకొని కారులోని డ్రైవర్ సీట్ కింద పెట్టుకొని ఐడిబిఐ బ్యాంకు వద్ద పార్కింగ్ చేసి సదరు వ్యక్తి బ్యాంకులోకి వెళ్లారు. ఇద్దరు వ్యక్తులు కారుద్దాలు పగలగొట్టి 2 లక్షల రూపాయలు ఎత్తుకెళ్లారు. ఈ దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తుల్లో హరీష్ అనే వ్యక్తిని పోలీసుల అరెస్టు చేశారు. ఈ సమావేశంలో ఏసీబీ అంకిత కుమార్, సిఐ రఘుపతి రెడ్డి, ఎస్ఐ భరత్, క్రైమ్ కానిస్టేబుల్ కర్ణాకర్, రామన్న, అనిల్ కుమార్, సాగర్, ఐడి పార్టీ పోలీసులు సల్మాన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇప్పగూడెంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

స్టేషన్‌ఘనపూర్ : మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో ముదిరాజుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట, పురోహితులు బొర్రాహరికిషన్ శర్మ, పాండు రంగ శాస్త్రి, విజయ సుబ్రమణ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. రేపు మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు గొడుగు ఐలయ్య, మునిగెల రమేష్, చైర్మన్ పిట్టల శ్రీనివాస్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి అ న్నెపు యాకయ్య, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు అన్నెపు రమేష్, వీరస్వామి, కార్యదర్శి పిట్టల నరేందర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : సీపీఎం



నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, మండల నాయకులు సోమసత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎఫ్ఎస్‌సిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని సీపీఎం బృందం సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్లు ఆరబోసుకునేందుకు రైతులకు స్థలం కేటాయించకపోవడం వల్లనే రైతులు రోడ్ల పై ఆరబోశారని, అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. లక్షలు వెచ్చించి పాలకుర్తి మండల కేంద్రంలో మార్కెట్ యార్డు నిర్మించినప్పటికీ వరి ధాన్యాన్ని కొనగోలు చేయడంలో ఇబ్బందులు ఏమిటని వారు ప్రశ్నించారు. రైతులు లక్షల రూపాయలు అప్పుతెచ్చి పెట్టుబడి పెట్టారని, అకాల వర్షాల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర కోసం రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. వాతావరణంలోని వర్షాభావ పరిస్థితుల్లో రైతాంగం పండించిన పంటకు ఏలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలన్నారు.వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకొని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. లేనిఎడల సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముసుకు ఇంద్రారెడ్డి, దండంపల్లి సోమన్న, దేశ బోయిన సతీష్, కే.ధనమ్మ, శ్రీలత పాల్గొన్నారు.



పాఠశాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కొడకండ్ల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1997-1998 బ్యాచ్ 10వ తరగతి పూర్వపు విద్యార్థులు పాఠశాల యాజమాన్యానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు లక్షా 30 వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలో ఆర్చితో కూడిన పెద్ద గేటు, చెట్ల చుట్టూ దిమ్మెలు, గోడలకు పెయింటింగ్‌తో పాటు సిపిఎస్ పాఠశాలలో 16 వేలరూపాయలతో నిర్మించి వాటర్ ట్యాంక్ నిర్మించి పాఠశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు ఆ బ్యాచ్ విద్యార్థులను అభినందించారు.

అత్యుత్తమ సేవలకు రాష్ట్ర స్థాయి పురస్కారం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

18 ఏండ్లుగా 108 అంబులెన్స్ ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడినందుకు, ఇఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఎమర్జెన్సీ అంబులెన్స్ ఈఎంటీ హరిక్రిష్ణ, పైలెట్ యాకయ్య సేవలను గుర్తించి సంస్థ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర స్థాయి అవార్డును 108 సీఈఓ ఖాలిద్, డైరెక్టర్ వెంకటేశం చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు.ఈసందర్భంగా అవార్డు పొందడంతో తమ బాధ్యతను మరింత పెంచిందని, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మండ శ్రీనివాస్, సిబ్బంది వారిని అభినందించారు.





అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందిస్తున్న పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పంచాయితీ కార్యదర్శి జేసు మణి అన్నారు. మండలంలోని నమిలిగొండ గ్రామంలోని అంగన్వాడీ మొదటి కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు బి.రజిత ఆధ్వర్యంలో ఈసీసీఈ ప్రీ స్కూల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు ఆకుకూరలు, గుడ్లు, పోషకాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా జన్మిస్తారని అన్నారు.పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాలతో సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సునిత, వీఓఏ నర్మద, ఆశాలు రాజమణి, అంగన్ వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథకు డైరెక్ట్ కనెక్షన్

- 'నవతెలంగాణ' వార్తకు స్పందన



నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైపులైనుకు డైరెక్ట్ కనెక్షన్ సోమవారం ఇచ్చారు. ఆదివారం మున్సిపాలిటీలో డైరెక్టు కనెక్షన్ తొలగింపు... నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్న ప్రజలు శీర్షికతో 'నవతెలంగాణ'లో వచ్చిన వార్త కథనంపై మున్సిపల్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు సోమవారం స్పందించారు. సేవానగర్‌లోని మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్‌కు డైరెక్ట్ కనెక్షన్ ఇచ్చి 9వ వార్డు ప్రజల దాహాన్ని తీర్చినట్లు అధికారులు తెలిపారు. సేవానగర్ ప్రజల తాగునీటి సమస్యను వెలుగులోకి తెచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'నవతెలంగాణ'ను పట్టణ ప్రజలు అభినందించారు. సహకరించిన మున్సిపల్, మిషన్ భగీరథ సిబ్బందికి పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్‌లు ఆర్థికంగా బలోపేతం చెందాలి

- శాసనమండలి ఉపసభాపతి డాక్టర్ బండ ప్రకాష్



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

ముదిరాజు కులస్తులు ఆర్థికంగా బలోపేతం చెందాలని తెలంగాణ శాసన మండలి ఉపసభాపతి డాక్టర్ బండ ప్రకాష్ అన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ ఆహ్వానం మేరకు మండలంలోని అమ్మపురం గ్రామంలో ముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిల్లాసహదవ్, బుస మల్లేశం, చొప్పరి సోమయ్య, పంజా వెంకన్న, బండి సతీష్, కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మతతత్వ బీజేపీని ఓడించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

నవతెలంగాణ-బయ్యారం

రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మతతత్వ బిజెపిని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలో నిడికొండ చంటి అధ్యక్షతన జరిగిన మండల విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి బిజెపి పరిపాలనలో ప్రభుత్వ సెక్టార్లను ప్రైవేటు పరం చేస్తూ దేశ సంపదను కొద్ది మంది చేతుల్లోనే కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టి మళ్లీ అధికారంలోకి రావాలనే ప్రయత్నంతోనే ప్రజల ముందుకు మోదీ మళ్లీ వస్తున్నాడని అన్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి కంటే రైతులకు, కార్మికులకు చేసిన నష్టాలే ఎక్కువ అని, రైతుల వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తెచ్చి రైతుల్ని అధోగతి పాలు చేయాలని చూశారని పేర్కొన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ జాడే లేదని, కేవలం దేవుని పేరు చెప్పి ఓట్లు సీట్లు గుంజాలని చూస్తున్న బిజెపిని ఓడించాలని అన్నారు. అదే విధంగా బయ్యారం పెద్ద చెరువు కాలువలు శిథిలా వ్యవస్థకు చేరుకున్నాయని, తక్షణమే మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టుకు నీరు అందించాలని, తులాం ప్రాజెక్టు ఎత్తు పెంచి, ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలను మరమ్మతులు చేసి పట్టణ ప్రజలకు తాగు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మండా రాజన్న, మండల కార్యదర్శి నంబూరి మధు, కమిటీ సభ్యులు వలాల్ల వెంకన్న, ఎస్కే యాకూబ్, వెన్ను మోహన్, బిక్షం, పెంటయ్య, వెంకన్న, పురుషోత్తం, కన్నయ్య, బొబ్బిలి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- ఎఫ్ఎంఎంఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎన్.శిరీష

నవతెలంగాణ-మరిపెడ

గ్రామీణ ప్రాంతాలలో నేటికీ బాల్య వివాహాలు కొనసాగుతున్నాయని వాటిని వెంటనే అరికట్టాలని, మానవ అక్రమ రవాణాలను నిర్మూలించాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ మరిపెడ మండల కోఆర్డినేటర్ నీరుడు శిరీష అన్నారు. సోమవారం ఊల్లెపల్లి, గ్రామంలో ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో శిరీష మాట్లాడుతూ మహిళలపై అసాంఘిక అశీలత ప్రదర్శించిన వారిపై క్రైమ్ బ్రాంచ్ సైబర్ నేరం కింద ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. ప్రమాదంలో ఉన్న సందర్భంలో 100,1098, 181, 1930 నెంబర్లకు డయల్ చేయాలన్నారు. అంతేగాక మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయపరంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శ్రీలక్ష్మి, కాంతమ్మ, శ్రీలత, విజయలక్ష్మి వెంకన్న, వీరభద్రం, గణేషు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

నవతెలంగాణ-దంతాలపల్లి

మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ధరిత్రి దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణు మాధవరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఓజోన్ పరిరక్షణ, జీవన వైద్యం, భూమ్మీద వృక్ష సంపదను దాని యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు తెలుపుతూ, ఓజోన్ పొర దెబ్బ తినడం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడి మానవాళికి జబ్బులు వస్తున్నాయని, విద్యార్థులు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

లెనిన్ జయంతి సందర్భంగా జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలో సోమవారం దొరన్న స్మారక భవనం వద్ద లెనిన్ 154వ జయంతి, సిపిఐ ఎంఎల్ 54వ జన్మదినం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చింత వెంకన్న పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, జీ. సక్రు, పిఓడబ్ల్యు మండలాధ్యక్షురాలు బొల్లం సోమక్క, తూముల నరసింహారావు, కొండ సాయమ్మ, తేజ, తులస్య, బిక్షం, బద్రు, వల్లాల మదు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ అంతం కోసం సీపీఐ ఎంఎల్...

నవతెలంగాణ-దంతాలపల్లి

దేశవ్యాప్తంగా పీడిత తాడిత ప్రజలపై సాగుతున్న శ్రమ దోపిడీ అంతంకై సీపీఐ (ఎంఎల్) ఏర్పడిందని మాస్ లైన్ ప్రజాపంథా తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముజంపల్లి వీరన్న, మండల సహాయ కార్యదర్శి సెగ్గం యాకయ్య అన్నారు. సీపీఐ ఎంఎల్ 55వ ఆవిర్భావ దినోత్సవం,మార్క్స్ మహోపాధ్యాయులు లెనిన్ 154 జయంతిని పురస్కరించుకొని దంతాలపల్లి మండల కేంద్రం, కుమ్మరికుంట్ల, పెద్దముప్పారం గ్రామాలలో సోమవారం జెండాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు ఏరుకొండ ప్రవీణ్, మండల కార్యదర్శి చింతా నవీన్, డివిజన్ నాయకులు రాజేశ్వర్ రెడ్డి, రాములు, వెంకన్న, యాకయ్య, ఏరుకొండ శ్రీను, కొమరయ్య, మహేష్, ప్రవీణ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు : సిపిఐ ఎంఎల్ 55వ ఆవిర్భావ సందర్భంగా సోమవారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద పార్టీ డివిజన్ కార్యదర్శి మంగంపల్లి వీరన్న జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికలలో బిజెపి, ఎన్డీఏ కూటమికి ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్, బిజెపిలను విమర్శించడం తప్ప ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేయడంలో దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. అనంతరం తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజపల్లి వీరన్న మాట్లాడుతూ ఈటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతాంగాన్ని ఎకరాక 30 వేల రూపాయలు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని లేదంటే ఆందోళన తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మండలాల కార్యదర్శి చింతా నవీన్, షరీఫ్, బాలు, బీమా, వెంకన్న, రామస్వామి, యాక స్వాములు, వీరస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

శౌరి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని కాచనపల్లి గ్రామపంచాయతీ కృష్ణపురంలో భానోతు శౌరి సోమవారం అకాల మరణం చెందడంతో ఆ కుటుంబాన్ని సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కంబాల ముసలయ్య పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌పి పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా దార్ల శివరాజ్

నెల్లికుదురు : బీఎస్‌పి పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా దార్ల శివరాజ్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ నియమించినట్లు దార్ల శివరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దార్ల శివరాజ్ సోమవారం మాట్లాడుతూ స్టార్ క్యాంపెయినగా అవకాశం కల్పించిన బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహన్ మాయావతి, బీఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్, సెంట్రల్ కో-ఆర్డినేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

గాలివాన బీభత్సం

నవతెలంగాణ-గార్ల

మండలంలో కురిసిన అకాల వర్షం, వీచిన పెనుగాలులకు మండలంలోని సీతంపేట, బుద్దారం, పినిరెడ్డిగూడెం,మద్దివంచ, పోచారం, ముల్కనూరు, పుల్లూరు తదితర పంచాయతీలలో వందలా ఎకరాల మామిడి కాయలు నేలమట్టం అయ్యాయి. మండలంలోని సీతంపేట గ్రామంలో గడ్డిపాటి రాజారావుకు చెందిన మామిడి తోటలో వర్షాలకు రాలిన మామిడి తోటలను సోమవారం జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి జె.మరియన్న, మండల అధికారి టి.వరుణ్, విష్ణు, అనిత క్షేత్ర సాయిలో పరిశీలించారు.మండల వ్యాప్తంగా అకాల వర్షం, గాలి దుమారం కారణంగా 350 ఎకరాలకు పైగా మామిడి తోటలలో యాభై శాతంకు పైగా మామిడి కాయల పంట నష్టం జరిగిందని జిల్లా అధికారి మరియన్న తెలిపారు. జరిగిన పంటల నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. కాగా అకాల వర్షం కారణంగా పలు చోట్ల 32కు పైగా విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరా రాత్రి నుండి నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సత్యనారాయణపురం గ్రామంలో ఓ కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటల చెలరేగాయి. సీతంపేట, గోపాలపురం తదితర ప్రాంతాలలో రోడ్డు పై చెట్ల కొమ్మలు విరిగి పడి రాకపోకలకు అంతరాయం కలిగింది.

నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

అకాల వర్షం, గాలుల కారణంగా మామిడి కాయలు నేల రాలి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి యాభై వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా నాయకులు గడ్డి పాటి రాజారావు డిమాండ్ చేశారు. ఇప్పటికే అంతంత మాత్రంగా కాసిన మామిడి కాయలు అకాల వర్షంతో రైతులకు మరింత నష్ట వాటిల్లిందని ఆవేదన వెలిబుచ్చారు.కొన్ని చోట్ల ఆరబోసిన యాసంగి వరి ధాన్యం తడిసి పోయిందని తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు ఎకరానికి 20 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన మామిడి రైతులు గట్టి పాటి రాజారావు, నాగ సురేష్, విజయలక్ష్మి, ప్రసాద్, నరసింహారావు, నంద్యా బాబు, వెంకటేశ్వర్లు, బిక్షమరెడ్డి, పి.వెంకటేశ్వర్లు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బయ్యారం : మండలంలో గాలివాన భీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.మండల వ్యాప్తంగా వీచిన ఈదురు గాలులు ప్రజలను బెంబేలెత్తించాయి.మండలంలో పలు ప్రాంతాల్లో గాలిదుమారం దాటికి విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దాంతో మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడి తోటలో కాయలు నేల రాడడంతో రైతులు దిగారు చెందారు. విద్యుత్ సిబ్బంది లైన్ల పై పడ్డ చెట్ల కొమ్మలను తొలగించి, విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

1339 ఎకరాలలో పంట నష్టం : ఉద్యావన శాఖ అధికారి అనిత శ్రీ

మరిపెడ : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలో ఆదివారం అకాలంగా వచ్చిన వర్షం, ఉరుములు మెరుపులతో ఇచ్చిన ఈదురు గాలులకు వందలాది ఎకరాలలో మామిడి తోటలో నష్టం జరిగింది. గత ఆరు నెలల పాటు కాపలా ఉంటూ కాపాడుకున్న మామిడికాయలు నేలపాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సోమవారం ఉద్యవాన శాఖ అధికారి అనితశ్రీ సోమవారం మరిపెడ మున్సిపాలిటీ శివారు ఆమ్లెలోత్ మోహన్ నాయక్ చెందిన మామిడి తోటను పరిశీలించారు. డోర్నకల్ నియోజకవర్గంలో మామిడి తోటలకు జరిగిన నష్టంపై నియోజకవర్గంలో పంట నష్టంన్ని వెల్లడించారు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో 12 మంది రైతులకుగాను 80 ఎకరాల పంట నష్టం జరిగినట్లు తెలిపారు. ఎడ్జెర్లలో12 రైతులకు చెందిన 60 ఎకరాలు, అబ్బాయిపాలంలో పదిమంది రైతులకు చెందిన 30 ఎకరాలు, పురుషోత్తమాయగూడెంలో పదిమంది రైతులకు చెందిన 40 ఎకరాలు, ధర్మారం 23 మంది రైతులకు చెందిన 80 ఎకరాలు, బీచ్‌రాజుపల్లిలో 10 మంది రైతులకు చెందిన పది ఎకరాలు, మోదుగుల గూడెంలో పది మంది రైతులు 80 ఎకరాలు, తాళ్లసంకీస 10 మంది రైతులు 50 ఎకరాలు, కొరవి 20 మంది రైతులు 80 ఎకరాలు, సిరోలు పది మంది రైతులు 50 ఎకరాలు, కాంపల్లిలో 20 మంది రైతులు 50 ఎకరాలు, గుండ్రాతి మడుగులో 20 మంది రైతులు 70 ఎకరాలు, రాజోలులో పదిమంది రైతులు 60 ఎకరాలు, మొగిలిచర్లలో పదిమంది రైతులు 80 ఎకరాలు, బలపాలలో పదిమంది రైతులు 80 ఎకరాలు, పెరమళ్ళ సంకీసలో పదిమంది రైతులు 60 ఎకరాలు, మన్నెగూడెంలో పది మంది రైతులు 40 ఎకరాలు, గొల్లచర్లలో పదిమంది రైతులు 60 ఎకరాలు, చిలుకోడులో పదిమంది రైతులు 60 ఎకరాలు, వెన్నవరంలో ముగ్గురు రైతులు 30 ఎకరాలు, జయ్యారంలో 14 మంది రైతులు 40 ఎకరాలు, ఉగ్గంపల్లి 16 మంది రైతులు 40 ఎకరాలు, మొత్తం డోర్నకల్ నియోజకవర్గంలో 273 మంది రైతులకు చెందిన 1330 ఎకరాలలో మామిడి తోటల పంట నష్టం జరిగినట్లు తమ సర్వేలో తేలిందని ఆమె తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని ఆమె తెలిపారు. అంతేగాక 33 శాతం పంట నష్టపోయిన రైతులకు ఎట్టారుకు 18 వేల రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు.

- నేల రాలిన మామిడి కాయలు, విరిగిన విద్యుత్ స్తంభాలు
- మామిడి తోటలను పరిశీలించిన ఉద్యాన వన అధికారులు











బలహీన వర్గాల బద్ధశత్రువు బీజేపీ

- పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక ఉద్యమాలు
- చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి-స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-మహబూబాబాద్

దళిత గిరిజన బలహీనవర్గాలకు రాజ్యాంగబద్ధంగా కల్పించబడిన హక్కులను కాలరాస్తూ బలహీన వర్గాల బద్ధ శత్రువుగా నిలిచిన మతోన్మాద బీజేపీని అధికారానికి దూరంగా ఉంచాలని పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక ఉద్యమాలను బలోపేతం చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో పూలే అంబేద్కర్ జన జాతర జిల్లా సదస్సు నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి, కల్లుగీతా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యమగాని వెంకన్న అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంవి రమణ, టీ.స్కైలాబ్ బాబు మాట్లాడుతూరాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించడమే సామాజిక శక్తులకు కర్తవ్యమన్నారు. బిజెపి 10 ఏళ్ల పాలనలో దళితులపై 300 రెట్లు దాడులు పెరిగాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా రిజర్వేషన్లు లేకుండా చేయాలని బిజెపి సర్కార్ యోచిస్తుందని, తద్వారా సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందని విమర్శించారు. విద్యా, ఉపాధి, వైద్యం వంటి ప్రజల మౌలిక అవసరాలను మరుగున పెట్టి మత ఉద్రిక్తతలు అభద్రతల చుట్టూ దేశాన్ని నడిపిస్తుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట ఏమైందని ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. అట్టడుగు పేదలుగా ఉన్న వారు నిలువ నీడ కోసం గుడిసెలు వేసుకుంటే పేదల కోసమే రాజకీయం చేస్తున్నామన్నవారు పేదల గుడిసెలు తొలగిస్తున్నారని వస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఆ పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సంఘాల నాయకులు, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ బొల్లం అశోక్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బుక్యా హరి నాయక్, జిల్లా అధ్యక్షులు భానోత్ వెంకన్న నాయక్, రజక వృతిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దుగ్గి లక్ష్మీనారాయణ, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మందుల మహేందర్, అశ్విని, పులిపాక నాగరాజు, జీఎంపిఎస్ టౌన్ శేషం ప్రశాంత్, విజయలక్ష్మి, ఉమారాణి, ఇంద్ర, అధ్యక్షులు దేవనబోయిన మల్లేష్, రోజా తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న కుమ్మరికుంట్ల పెద్ద చెరువు

- మట్టి పోసి చెరువును ఆక్రమిస్తున్న రైతులు



నవతెలంగాణ-దంతాలపల్లి

వేసవి కావడంతో భూగర్భ జలాలు అడుగంటడంతో చెరువులు ఎండిపోతున్నాయి. ఇదే క్రమంలో కుమ్మరికుంట్ల పెద్ద చెరువు పూర్తిగా ఎండిపోతుండడంతో అక్రమార్కులకు వరంగామారింది. పెద్ద చెరువుకు సంబంధించిన మత్స్య శాఖ సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అక్రమంగా చెరువు మట్టిని తవ్వి నడిచెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలతో నడిచెరువులో మట్టి కుప్పలు పోయిస్తు అక్రమార్కులు భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామాలలో భూముల ధరలు ఆకాశాన్ని తాకడంతో అక్రమార్కులు చెరువులను అక్రమిస్తున్నారు. ఇప్పటికే వందల ఎకరాల భూమిని కబ్జా అయిందని గ్రామంలోని పలువురు ఆరోపిస్తున్నారు. చెరువు శిఖంలోని వివిధ ప్రాంతంలో అక్రమార్కులు చెరువులు కబ్జా చేసేందుకు మట్టిపోసి చదును చేశారు.దీంతో సుమారు వందల గజాల మేర చెరువును ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులు స్పందించి పెద్ద చెరువు అక్రమనకు గురికాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భూముల డిమాండ్ పెరగడంతో...

మండలంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో చెరువులు, కుంటల శిఖం భూములపై అక్రమార్కుల కన్నుపడింది. మండలంలోని కుమ్మరికుంట్ల, నిదానపురం గ్రామాల్లో శిఖాలు కాలక్రమేన కబ్జాకు గురవుతున్నాయి. దీనివల్ల చెరువుల విస్తీర్ణం తగ్గిపోతుంది. ఈ భూముల్లో చేపట్టిన నిర్మాణాలు, నడిచెరువులు అడ్డుగా పోస్తున్న మట్టి కుప్పలు, వరదలకు అడ్డుగా ఉండడంతో నీటి నిల్వ సామర్థ్యం కూడా తగ్గుతుంది.

సమన్వాయ లోపం...

మండలంలో సాగు విస్తీర్ణం సుమారు 8,299 ఎకరాలకు పైగా ఉంది. అందులో సుమారు 1,450 ఎకరాలకు చెరువుల నీరే ఆధారం. ఆయా చెరువు కుంటలను నమ్ముకొని సాగు చేస్తున్న రైతులు కబ్జాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.అధికారులదృష్టికి తీసుకెళ్లిన పూర్తిస్థాయిలో పరిష్కారం లభించడం లేదు. చెరువుల రక్షణ బాధ్యత రెవిన్యూ, నీటిపారుదల శాఖలదే. ఈ రెండు శాఖల అధికారుల మధ్య సమన్వాయ లోపం... అక్రమార్కులకు వరంగా మారుతుంది. ఫలితంగా వారు కబ్జాలు చేస్తూ సాగు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి సర్వేలు చేపట్టికబ్జాలను అరికట్టేందుకు చర్యలకుతీసుకోవాల్సిన అవసరం ఉంది.

చిల్ల రామనారాయణ, మత్స్యశాఖ సహకార సంఘం కార్యదర్శి



ఒకప్పుడు గొలుసు కట్టు చెరువులతో పంట పొలాలు పచ్చగా కనిపించేవి. నేడు రియల్ వ్యాపారులు, కబ్జారాయుళ్లతో చెరువులు కనుమరుగై నీరు నిలిచే పరిస్థితి లేకుండా చేశారంటూ స్థానికులు ముదిరాజ్ సంఘం మత్స్యశాఖ ఉపాధ్యక్షులు బత్తిని మల్లయ్య, చిల్ల రామనారాయణ చిల్ల మధు మండిపడుతున్నారు. కబ్జాలకు పాల్పడ్డ వారిపై ఇరిగేషన్ అధికారులు పట్టించుకుని చర్యలు తీసుకోవాలి. అలాంటి పనులపై దృష్టి పెట్టకుండా, వ్యక్తిగత స్వార్థం కోసం అలవాటు పడి ప్రజలను, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎగువ వరద నీటి కాలువలు, శిఖం భూములు చాలా వరకు కబ్జాకు గురికావడంతో నీరు వెళ్లే మార్గం లేక దిగువనున్న పంట పొలాలు మునిగిపోతున్నాయి. తాజాగా మండలంలోని నిదానపురం, యానకుంట చెరువు మత్తడికి గండిపడింది. లక్షల విలువ చేసే చేపలను మత్స్యకారులు నష్టపోవాల్సి వచ్చింది.

అక్రమణదారులపై చర్యలు తప్పవు : ఇరిగేషన్ డిఈ వినయ్



ఎవరైనా చెరువులు, కుంటలను కబ్జా చేసి ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు. ఫిర్యాదులు చేస్తే విచారణ చేపడతాం.సర్వేలు చేయించి హద్దులు నాటిస్తాం. చెరువులు కుంటలను పరిశీలించాలని తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు పంపుతాం.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మొగుళ్ల సత్తయ్య తల్లి స్వాతంత్ర సమర యోధురాలు మోగుళ్ల ముత్తమ్మ మృతి చెందగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా నిరంతరం అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పొనుగోటి సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్ శీలం లింగన్న గౌడ్, కుర్ర శ్రీనివాస్ గౌడ్, జాటోత్ సురేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వధూవరులకు బలరాం నాయక్ ఆశీర్వచనాలు



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని గాంధీపురం గ్రామ పంచాయితి పరిధిలోని వెంకట్రాం తండాకి చెందిన హుస్సేన్ నాయక్ కుమారుడు వెంకటేష్-తేజస్విని రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, జిల్లా నాయకులు గంట సంజీవ రెడ్డి, మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్, పీసీసీ సభ్యులు దస్రు నాయక్, బండారు దయాకర్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, ఓబిసి జిల్లా అధ్యక్షులు మేకల వీరన్న, కల్వల గ్రామ పార్టీ అధ్యక్షుడు గండి శ్రీను, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్



నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని బాల్యాతండా గ్రామంలో గుగులోత్ వీరన్న-కాంతి దంపతుల ఏకైక పుత్రిక బిందు వివాహ వేడుకలో సోమవారం మహబూబాబాద్ జిల్లా జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు నాయక్ పాల్గొని నూతన వధూవరులు బిందు-సురేష్‌లకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంగోత్ శ్రీకాంత్ నాయక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



నవతెలంగాణ-దంతాలపల్లి

ట్రాక్టర్ ఢీకొని విద్యుత్ స్తంభం విరిగిన ఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని కుమ్మ రికుంట్ల గ్రామంలో జిన్నా మూలమలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని సోమవారం ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో స్తంభం మధ్యకు విరిగిపడి విద్యుత్ తీగలు రోడ్డుపై పడ్డాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-గార్ల

అకాల వర్షం కారణంగా తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 20 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ గిరిజన సంఘం మండల కార్యదర్శి భూక్య హరినాయక్ డిమాండ్ చేశారు. అకాల వర్షం కారణంగా మర్రిగూడెం, శేరిపురం, సీతంపేట, పినిరెడ్డిగూడెం తదితర గ్రామాలలో రైతులు ఆరబోసిన తడిసిన వరి ధాన్యాన్ని టిజిఎస్ ఆధ్వర్యంలో సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మర్రిగూడెం తండాలో వర్షం కారణంగా కళ్యాణి అనే గిరిజన మహిళ ఇంటిని పరిశీలించారు. గాలి దుమారం కారణంగా ఇల్లు కూలీన పేద కుటుంబానికి 25 వేల రూపాయల నష్టపరిహారంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నేత మృతి

నవతెలంగాణ-గార్ల

మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంక్ బజార్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోడం కొమురయ్య(63) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కొమురయ్య మృతదేహం పై ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా, ఆ పార్టీ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, నాయకులు పానుగంటి రాధాకృష్ణ, ఎంపిటీసీ శీలం శెట్టి రమేష్, కో-అప్షన్ సభ్యులు ఖదీర్,నాయకులు మురళీ, గణేష్, సిపిఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్,వైఎస్ ఎంపిపి కట్టె బోయిన శ్రీనివాస్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

నెల్లికుదురు : మండలంలోని మనిగలవీడు ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గురుకుల విద్యాలయాలకు పరీక్షలు రాసి ప్రతిభ కనబరిచి గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య తెలిపారు. సోమవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న దబ్బేట సహస్ర, షేక్ జావిద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు సంపాదించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కడియం వెంకటయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.



ఇనుగుర్తి : మండల కేంద్రంలోని విజ్ఞాన్ హై స్కూల్ పాఠశాల నుండి 16 మంది సీట్లు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గంజి వీరేందర్ రెడ్డి తెలిపారు. వీరేందర్ రెడ్డి మాట్లాడుతూ విజయానికి సహకరించిన ఉపాధ్యాయ బృందానికి విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీమోహన్, చంద్రమోహన్, భాస్కరాచారి, అనిత, నిర్మల, అర్చన, స్వప్న, నీరజ విద్యార్థులను అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా వార్షికోత్సవం

నవతెలంగాణ-మహాదేవపూర్



మండలంలోని ఐసీడీఎస్ పరిధి మహాదేవపూర్ సెక్టార్ పీఓ రాధిక, సూపర్వైజర్ నాగరాణి ఆదేశాల మేరకు సోమవారం కుదురుపల్లి అంగనవాడీ కేంద్రంలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ నిర్మల మాట్లాడుతూ... 3 ఏండ్ల నుంచి 6ఏండ్లలోపు పిల్లల తల్లి దండ్రులకు అభివృద్ధి సూచిక కార్డులను అందజేసి కార్డు లోని అంశాలను వివరించారు. పిల్లలతో తయారు చేయించిన ప్రీస్కూల్ మెటీరియల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నిర్మల, ఆయా, ఆశా వర్కర్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- వెలిశాల డాక్టర్ ఆశాజ్యోతి

నవతెలంగాణ-టేకుమట్ల



వడదెబ్బ తగలకుండా మండల ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలని వెలిశాల డాక్టర్ ఆశాజ్యోతి అన్నారు. సోమవారం మండలం లోని వెలిశాల గ్రామంలో అవగాహనా సదస్సు నిర్వహించి ఆమె మాట్లాడారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు, ఉపాధి, వ్యవసాయ కూలీలు ఉదయం 11 గంటల లోపే పనులు ముగించుకోవాలన్నారు. తిరిగి సాయంత్రం 4గంటల తర్వాత పనులు చేసుకోవాలని అన్నారు. వడదెబ్బ సోకిన వారికి తలనొప్పి, తల తిరగడం, తీవ్ర జ్వరం, తక్కువ మూత్ర విసర్జన వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇలాంటప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలిశాల గ్రామ ఆదర్శ ఐక్య సంఘ సభ్యులు, వివోఏ సుమతి, ఎమ్మెల్ హెచ్ పి డాక్టర్ మధురిమ, హెచ్ ఈ ఓ జమాలుద్దీన్, హెచ్ ఎ కష్టారెడ్డి, సతీష్, ఏఎన్ఎం సంగీత రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్త కోమల, ఫార్మసిస్టు రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ బుచ్చిబాబు, డీఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం

- పుస్తకావిష్కరణ సభలో ప్రజా సంఘాల నాయకులు

నవతెలంగాణ - ములుగు



రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక వాదాన్ని, ప్రజావాక్కు స్వతంత్రాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. సోమవారం ములుగు గాంధీ విగ్రహం వద్ద ప్రముఖ పాత్రికేయుడు, న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రవీణ్ ప్రబీర్ పూర్కాయస్థా 'అలుపెరుగని పోరాటం' పుస్తకం ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం రాష్ట్ర నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ, ములుగు జిల్లా జేఏసీ అధ్యక్షుడు ముంజల బిక్షపతి, ములుగు మాజీ సర్పంచ్ గుగ్గిల సాగర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, అంబేద్కర్ సంఘం నాయకులు జన్ను రవి, నార్లాపూర్ మాజీ సర్పంచ్ దేవా మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారన్నారు. దేశంలో అనేకమంది ప్రజాతంత్ర వాదులను జైలుకు పంపించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రజా సంస్థలు, మతోన్మాదంపై బీజేపీ చేస్తున్న దుర్మార్గాల మీద మాట్లాడిన న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రవీణ్ ప్రబీర్ పూర్కాయస్థాను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజాసంఘాలు ఖండించాయని అన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క న్యూస్ క్లిక్ ఎడిటర్‌పైనే కాకుండా అనేక మందిపై ఉపా చట్టాలు మోపి గొంతు నొక్కుతున్నదని మండిపడ్డారు. దేశంలో ప్రజా సామ్యాన్ని, లౌకికవాదాన్ని తుంగలో తొక్కే పద్ధతి బీజేపీ అవలంభిస్తున్నదని అన్నారు. ప్రజాతంత్ర వాదులు, మేధావులపై దాడి చేయడం ద్వారా ప్రజా గొంతుక ఆగదని, పోరాటం నిర్వహిస్తూనే ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాతంత్ర వాదులు, ప్రజలు, మేధావులు ఏకమై మతోన్మాద బీజేపీని ఓడగొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ ఒకటే మంచి పార్టీ అని మిగతా పార్టీలన్నీ అవినీతి పార్టీలని వారి పై ఈడీ దాడులు చేస్తుందన్నారు. అనంతరం న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రవీణ్ ప్రబీర్ పూర్కాయస్థాను వెంటనే విడుదల చేయాలని, అతనిపై ఉపా చట్టం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ గఫూర్, వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా నాయకులు పొదిల చిట్టిబాబు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది రాజేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణి సమస్యలకు పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నవతెలంగాణ - ములుగు

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన 18 దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేశారు. శాఖల వారిగా పెండింగ్ సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీఎం(సివిల్ సప్లయ్) రాంపతి, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయచందర్, డీ ఓ పాణిని, ఇతర అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ శనిగరపు భద్రయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ-2 పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదువుకొని ఉన్నత లక్ష్యం నిర్ణయించుకొని తల్లిదండ్రులకు,పాఠశాలకు పేరు ప్రతిష్ట తీసుకురావాలన్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా తర్వాత తరగతికి సంబంధించిన పుస్తకాలను చదువుతూ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలన్నారు. పరీక్షలు పూర్తవుతున్నందున జవాబు పత్రాల మూల్యాంకనం చేయాలన్నారు. ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో మార్కులను నమోదు చేసి విద్యార్థుల ప్రగతి పత్రాలు ప్రింట్ తీయాలన్నారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు నేడు అందజేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఎస్ఏ-2 పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల విషయంలో ప్రధానోపాధ్యాయులు విజయపాల్ రెడ్డి తగు శ్రద్ధ తీసుకున్నందుకు అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగిల్ విండో డైరెక్టర్ రాజేశ్వరరావు సస్పెన్షన్ ?

ఆలస్యంగా వెలుగులోకి

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము సింగిల్ విండో డైరెక్టర్ మల్కా రాజేశ్వరరావు సొసైటీ ఆదాయానికి విరుద్ధంగా ప్రయివేటు ఎరువుల, విత్తనాల వ్యాపారం చేస్తున్నందుకు సస్పెన్షన్ అయినట్టు తెలిసింది. పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసినప్పుడు సొసైటీ ఆదాయం పెంచడానికి, అభివృద్ధికి కృషి చేస్తాము, రైతులకు సొసైటీ ద్వారా ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచుతామని ప్రతిజ్ఞ చేసిన విషయం విదితమే. అయితే రాజేశ్వర్‌రావు పీఏసీఎస్‌లో సింగిల్ విండో డైరెక్టర్‌గా ఉండి సొసైటీ ఆదాయానికి గండికొట్టేలా, సహకార చట్టానికి విరుద్ధంగా తాడిచెర్లలో ప్రయివేటుగా ఎరువుల, విత్తనాల వ్యాపారం చేస్తున్నట్లుగా, సొసైటీలో ఉన్న కొంతమంది సభ్యులు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు భూపాలపల్లి డీసీఓ డి శైలజ పూర్తి విచారణ చేపట్టి ఈ నెల 20న రాజేశ్వర్‌రావును చట్ట ప్రకారం సస్పెన్షన్ చేసినట్లు ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇదే రాజేశ్వర్‌రావు గతంలో పీఏసీఎస్ అనుబంధ కేడీసీసీ బ్యాంక్‌లో రూ.10 లక్షల అప్పు తీసుకొని సకాలంలో చెల్లించకపోగా డిఫాల్టర్ అయిన విషయం తెలిసిందే.



సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 36 దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ భవేష్ మిశ్రాకు కృతజ్ఞతలు

- అక్షయ తల్లిదండ్రులు



నవతెలంగాణ-భూపాలపల్లి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు చిన్నారి అక్షయ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని ఎల్బీనగర్‌కు చెందిన కాజిపేట నరేష్, సుమలత దంపతుల కుమార్తె అక్షయ(7) గత సంవత్సరం దీపావళి వేడుకలో ప్రమాదవశాత్తు గాయపడడంతో మంచానికే పరిమితమైంది. ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న అక్షయ గురించి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలుసుకొని చిన్నారి వైద్య చికిత్సలు అందిస్తామని ఆదివారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అక్షయ తండ్రి నరేష్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ... చిన్నారి అక్షయకు వైద్యసేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని అన్నారు. తక్షణమే అక్షయను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఎంజీఎం వైద్యులతో మాట్లాడి అక్షయకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. అక్షయ వైద్య సేవలపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్‌కు సూచించారు. చిన్నారి ఆరోగ్యం మెరుగుపడే వరకు నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఎంజీఎంలో వైద్య సేవలు లేకపోతే హైదరాబాద్ సిఫారసు చేసి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తామని అన్నారు. అక్షయ తల్లిదండ్రులు అధైర్య పడవద్దని, చిన్నారి అక్షయ త్వరగా కోలుకుంటుందని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కోర్టు, సబ్ కోర్టు ప్రాంగణాల్లో న్యాయవాది వేషాల అనిల్ నానమ్మ తాతయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నారాయణ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ... వేసవి తాపాన్ని తట్టుకోవాలంటే సరిపడినంత నీటిని సేవించాలని అన్నారు. కోర్టుకు వచ్చే కక్షిదారుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసిన న్యాయవాది వేషాల అనిల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ రామచంద్రరావు , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి అఖిల , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బల్లా మహేందర్, ఏఓ అనిత వాని, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలిసు సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

100 రోజుల్లో ఒక్క హామీ నెర్చని కాంగ్రెస్

- మాజీ మంత్రి , ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

నవతెలంగాణ-ములుగు



కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో అందల మెక్కిందని, 100 రోజుల్లో ఒక్క హామీ నెరవేర్చలేదని, ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మెన్, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని అన్నారు. మహిళలకు రూ.2500, వృద్ధులకు వితంతువులకు రూ.2000 నుండి రూ.4వేలు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు పింఛన్లు కూడా ఇవ్వలేదని అన్నారు. కరువును తెచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీ నే అని, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే నట్టేట మునిగినట్లేనని విమర్శించారు. బడే నాగజ్యోతి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ములుగు జిల్లా ఏర్పడిందని, హాస్పిటల్‌తో పాటు మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటు చేసింది గత ప్రభుత్వమేనని అన్నారు. ఎన్నో నిధులు ఇచ్చి ములుగును అభివృద్ధి చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్‌బాబు, గోవింద్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి, వేములపల్లి బిక్షపతి, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, గై అశోక్, రాసమల్ల సురేందర్, పార్టీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొండంపల్లి గ్రామస్తులకు న్యాయం చేస్తాం


- ఆర్డీఓ మంగీలాల్

నవతెలంగాణ-గణపురం

సింగరేణి ఓసి త్రీ లో ఇండ్లు కోల్పోతున్న కొండంపల్లి నిర్వాసితుల కు న్యాయం చేస్తామని భూపాలపల్లి ఆర్డీవో మంగీలాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో ఇండ్లు కోల్పోతున్న భూ నిర్వాసితుల పిటిషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండంపల్లిలో ఇంటి స్థలాలు కోల్పోతున్న భూ నిర్వాసితుల పిటిషన్లు రోజువారీగా వాటిని పరిశీలిస్తామన్నారు. అనంతరం నివేదిక తయారుచేసి భూ నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వైలు దేవేందర్, రహీం పాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టిషర్ట్స్ అందజేత

నవతెలంగాణ-మల్హర్‌రావు



రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ఆదేశాల రాష్ట్ర యువ కాంగ్రెస్ నాయకుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీను బాబు చేతుల మీదుగా భూపాలపల్లి జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి లకావత్ సవెందర్‌కు క్రికెట్ క్రీడాకారులకు సంబంధించిన 18 టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడారు. యువతకు క్రీడలు ఆరోగ్యాన్ని, స్నేహపూరిత వాతావరణాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువతను ప్రోత్సహించడంలో ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మలహర్‌రావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు ఐత రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి కుమార్, మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, బూత్ అధ్యక్షుడు మహేందర్, యువ కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రాము, మహేందర్, రాజేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మొగుళ్ళ పల్లి



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో సోమవారం మండలంలోని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొగుళ్ళపల్లి మాజీ సర్పంచ్ మోటె ధర్మారావుతోపాటు ఆకుల వీరన్న, జనార్దన్, చంద్రబోస్, శ్యాంరావు, చాట్ల రవి, కిషన్, శివాజీ, శ్రీధర్, తదితరులు చేరారు. వారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సాంబమూర్తి, అప్పం కిషన్, పట్టణ అధ్యక్షులు క్యాతరాజు రమేష్, తక్కళ్ళపల్లి రాజు, నాయకులు పున్నం చందర్‌రావు, రఫీ, శివారెడ్డి, రవి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ-మహదేవపూర్



మండలం లోని కాళేశ్వరం అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద సోమవారం ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా మహారాష్ట్ర నుండి తెలంగాణకు, తెలంగాణ నుంచి మహారాష్ట్రకు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించి అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. వాహనదారులు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రాజేశం, సివిల్ సిఆర్పి పోలీసులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు

నవతెలంగాణ-గణపురం

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు మండలంలోని మైలారం ఉన్నత పాఠశాలలో వేగవంతంగా జరుగుతున్నాయి పనులతో పాటు విద్యుద్దీకరణ మరమ్మతులు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ అఫ్రోజ్ అహ్మద్ తెలిపారు. పనులను ఎంపీడీఓ భాస్కర్ గణపురం ఏఈల పర్యవేక్షలో గ్రామ సమైక్య సమితి అధ్యక్షురాలు బండ్ల కళావతి సభ్యుల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలోని అన్ని పనులను పాఠశాలలు పునః ప్రారంభమయ్యే వరకు పూర్తి చేయాలని తెలిపారు.

కబ్జాకు గురైన భూములను తిరిగి ఇప్పించాలి

- కలెక్టర్‌కు బాధిత రైతుల వినతి

నవతెలంగాణ-భూపాలపల్లి



కబ్జాకు గురైన తమ భూములను తిరిగి ఇప్పించాలని బాధిత రైతులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ భవేష్ మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూపాలపల్లి మున్సిపాలిటీ జంగేడు శివారు పరిధి కాసింపల్లిలోని సర్వే నెంబర్ 1630, 1631, 1632, 1647లోని 14 మంది రైతులకు చెందిన సుమారు 40 ఎకరాల భూమిని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, వారి అనుచరులు బొంతల సతీష్, మేనం రాజేందర్, మాడ ప్రతాపరెడ్డి, వారి బంధువుల పేరు మీద అక్రమ పట్టాలు చేయించుకున్నారని తెలిపారు. ఈ అక్రమాలను అడ్డుకున్న రైతులను భయభ్రాంతులకు గురిచేసి చంపుతామని బెదిరించి అక్కడ ఉన్న 40 ఎకరాల భూమిని పూర్తిగా చదును చేసి ఎవరి హద్దులు ఎవరో తెలియకుండా చేశారని ఆరోపించారు. అంతే కాకుండా మరి కొంతమంది రైతులు మున్సిపాలిటీ నర్సరీ సర్వే నెంబరు 978 లో 4ఎకరాల భూమిని కూడా కొత్త హరిబాబు 23 మంది రైతులను బెదిరించి తెల్ల కాగితం మీద సంతకాలు చేయించుకొని వారి భూమిని అక్రమంగా లాక్కున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ రెండు వారాలలో నిందితులకు నోటీసులు పంపి తమ భూములు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉడుత రాయమల్లు, ఉడత రాయలింగు, కాట్రేవుల స్వరూప, జోరు కొమురయ్య, జోరు రాజు, చల్ల లక్ష్మి, సల్ల భూమయ్య, అట్ల పెద్ద సమ్మయ్య, చీమల కృష్ణస్వామి తో పాటు సుమారు 30 మంది బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-సంగెం



మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఝాన్సీ లక్ష్మీబాయి గ్రామ సంఘం ఆధ్వర్యంలో ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్ కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, తేమ లేకుండా క్లీన్ చేసిన ధాన్యాన్ని మాత్రమే కాంటా వేయాలని సూచించారు. సెంటర్లో ప్యాడి క్లీనర్, అప్ డేటెడ్ వేయింగ్ మిషన్, సరిపడ టార్పాలిన్స్, వడదెబ్బ తగలకుండా టెంటు, తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. తేమ శాతం 17శాతం మించకుండా, చెత్త, తాలు రాళ్ళు లేకుండా తీసుకురావాలని రైతులను కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్ కుమార్,ఎంపీడీఓ రవీందర్, ఎపియం కిషన్,కార్యదర్శి రాజ్ కుమార్ సిసి సురేశ్,శత్రఘ్నుడు,కమిటీ సభ్యులు శ్రీమతి,కవిత,రాధిక,మంజుల,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

నవతెలంగాణ-పర్వతగిరి



హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో పర్వతగిరి మండలంలోని తూర్పు తండా గ్రామ మాజీ సర్పంచ్, ఇతర నాయకులు అలాగే ఇస్లావత్ తండా నుండి వైస్ ఎంపీపీ బానోతు రవి మాజీ సర్పంచ్ బానోత్ విజయ, సుమారు 150మంది నాయకులు, కార్యకర్త, యువకులను వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్, జెడ్పీటీసీ బానోతు సింగిలాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు వారికి పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పాత, కొత్త అనే విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరు కష్టపడి మన అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత

నవతెలంగాణ-చెన్నారావుపేట

డీబీఎం 40 కాలువ ద్వారా సాగునీరు అందక పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కేసీఆర్ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేదని, మాజీ ఎమ్మెల్యే కృషితో చెన్నరావుపేట మండలానికి కాలువ ద్వారా సమృద్ధిగా సాగునీరు వచ్చేదని అన్నారు. కానీ ఇప్పటి కాంగ్రెస్ పాలనలో పంటకు సాగునీరు అందక, కరెంట్ సరిగ్గా లేక, పంటలు ఎండిపోయిన రైతులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి రైతులు అనేక కష్టాల పాలవుతున్నారని, నష్టపోయిన పంట పొలాలను తక్షణమే సర్వే చేసి, రైతులకు పంట నష్టపరిహారం వెంటనే అందించాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అన్ని పంటలపై బోనస్ కూడా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పత్తినాయక్, సొసైటీ చైర్మన్ మురారి రవి,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాలు వెంకన్న, మాజీ జెడ్పిటిసి భుక్రితిరుపతి, మండల యువ నాయకుడు కంది కృష్ణ చైతన్య రెడ్డి, మూడు రమేష్, కుసుమ నరేందర్, భద్రూనాయక్ పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

నవతెలంగాణ-ఖానాపురం

మండలంలోని ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టి పంచాయతీ కార్యదర్శులు సహకారంతో సమస్యలు పరిష్కరించి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందిస్తున్నామని మండల మంచినీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి మౌనిక అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలు 15 ఆవాస ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ పైప్లైన్ నిర్మాణాలు పూర్తిచేసి 8110 నల్లా కలెక్షన్లు ఇచ్చామని తెలిపారు. మంచినీటిని నిల్వ ఉంచేందుకు 35 వాటర్ ట్యాంకులు ఉన్నాయని ప్రతి వారం రోజులకు ఒకసారి పారిశుధ్య



కార్మికుల సహకారంతో క్లోరినేషన్ చేయించి వాటర్ ట్యాంకులతో సహా నీటిని శుభ్రపరుస్తున్నామని అన్నారు. మంచినీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా ఉండడానికి గ్రామాలలో అవసరమైన బోర్లు 45, బావులు 25 అందుబాటులో ఉన్నాయని, బోర్లు, బావులు ద్వారా వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా చేయించి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తు న్నామని అన్నారు. సమయానికి మిషన్ భగీరథ నీరు అందకపోతే ప్రజలకు అందుబాటులో 208 బోరింగులు మరమ్మత్తులు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచామని, వాటి ద్వారా ప్రజలకు మంచినీటిని అందిస్తున్నామని అన్నారు. మండలంలో ఉన్న గ్రామాలలో మంచినీటి సమస్య తలెత్తితే 6309954366 ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.



గ్రామ సంఘాలు ప్రధాన పాత్ర పోషించాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట

నేటి సమాజంలో మహిళలకు చిన్న సంఘాల సభ్యులకు బలమైన వేదికలుగా గ్రామ సంఘాలు తోడ్పడుతున్నాయని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మునగాల దయాకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జల్లి గ్రామంలో భవానీ గ్రామ సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ సంఘాలు సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, విద్య మొదలైన అంశాలలో మహిళలను చైతన్యం చేయడానికి, గ్రామ సంఘాలు వారధిగా నిలిచాయని, పంచసూత్రాలు, కట్టుబాట్లు, జవాబుదారీతనంతో గ్రామ సంఘాల భాగస్వామ్యం కీలకమైందని డీపీఎం అన్నారు. ఆర్థికపరమైన అంశాల్లో బ్యాంకులకు తీసిపోని విధంగా సేవలు అందిస్తూ, చార్టెడ్ అకౌంట్ ద్వారా ఆడిట్ నిర్వహించుకుంటూ, విజయవంతంగా ప్రయాణించడంలో గ్రామస్థాయి సిబ్బంది, సెర్ప్ సిబ్బంది కృషి ప్రశంసనీయమని అభినందించారు. అనంతరం ప్రాజెక్టు మేనేజర్ ముక్కెర ఈశ్వర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ ఆరోగ్యాలను పర్యావరణాన్ని కాపాడుకోవడం సంఘ సభ్యుల బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుజాత, గ్రామ సంఘం అధ్యక్షురాలు తండ సుజాత, కవిత, రజిత, వీవోఏ అస్మా పాల్గొన్నారు.

5శాతం రిబేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే

నవతెలంగాణ-వరంగల్

ఐదు శాతం రిబేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 30లోగా పన్నులు చెల్లించే నగరవాసులకు ప్రభుత్వం 5శాతంరిబేట్ అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని పన్నులు చెల్లించి లబ్ది పొందాలని సూచించారు. పెద్ద వ్యాపార సంస్థలు, పాఠశాలు, కళశాలల యాజమాన్యాలు పన్నులు చెల్లించటతో ఈ స్కీం ఎంతగానో లబ్ది చేరుకుతుందని, ముందస్తు పన్నులు చెల్లించడం వల్ల నగర అబివృద్ధికి దోహదం చేసిన వారవుతారని అన్నారు. ప్రభుత్వం కల్పించే రిబేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని హన్మకొండలోనిఏషియన్ శ్రీదేవిమాల్ యాజమాన్యం సోమవారం రూ.12.3లక్షల చెక్‌ను డిప్యూటి కమిషనర్ రవిందర్‌కు అందజేశారు. వరంగల్ రత్న హోటల్ యాజమాన్యం 450131 చెక్‌ను అదనపు కమిషనర్ అనిసుర్ రశీద్‌కు అందజేశారు. ఈ కార్యాక్రమంలో డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారులు యూసుఫోద్దీన్, శహజాదిబేగం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సోహైల్, భరత్ చంద్ర,శీకాంత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి సెలవులు

విద్యార్థుల్లో ఆనందోత్సాహం

ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-వరంగల్



విద్యార్థులతో కళకళలాడిన పాఠశాలలు ఈ నెల 24 నుంచి వేసవి సెలవులు ఇవ్వడంతో బోసిపోనున్నాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వ వరకు వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఆనందోత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే పరీక్షలు ముగిసి వారు ఇంటి వద్దే ఉంటూ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు రేపటి నుంచి సెలవులు ప్రకటించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సొంత ఊర్లకు, బంధువుల ఇండ్లకు వెళ్తుంటారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎండలో తిరగనివ్వకుండా, ఈత, డ్రైవింగ్ లాంటివి చేయకుండా పిల్లలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పర్యవేక్షించాలి.

ప్రజాపాలనను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం ప్రతి కార్యకర్త శ్రమించాలి

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నవతెలంగాణ-సంగెం



ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడో మర్చిపోయిందని, పార్టీ చేరికల మీద ఉన్న దృష్టి ప్రజల సమస్యల పరిష్కారంపై లేదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని నల్లబెల్లి, బాలు నాయక్‌తండా, నార్లవాయి, ముమ్మిడివరం, మొండ్రాయి, గొల్లపల్లి, పల్లారు గూడ, వి.ఆర్.ఎన్ తండా, పోచమ్మతండ గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ కార్య కర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ చేరికల మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల మీద కాంగ్రెస్‌కు లేదని, డిసెంబర్ 9పోయి 4నెలలు అయింది. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, రైతులను నట్టేట ముంచి, కష్టాలపాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పాలనకు బీఆర్ఎస్ పాలనకు తేడా ఏంటో ప్రతి కార్యకర్త బాధ్యతగా ప్రజలకు వివరించాలన్నారు. గత ఎన్నికల్లో జరిగిన తప్పిదాలను కార్యకర్తలు గ్రహించి బాధ్యతగా గడప గడపకు వెళ్లి కారు గుర్తుకు ఓటువేయాలని ప్రజలను అడగాలన్నారు.వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్‌కు పరకాల నుండి భారీ మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో జడ్పిటిసి గూడ సుదర్శన్ రెడ్డి, నాయకులు నిమ్మగడ్డ వేంకటేశ్వర రావు, పసునూరి సారంగపాణి, పూలుగు సాగర్ రెడ్డి, వైస్ ఎంపిపి బుక్క మల్లయ్య, మండల కో ఆప్షన్ మన్సూర్ అలీ, జక్క మల్లయ్య,పూజారి గోవర్ధన్, ఉండీలా రాజు,కక్కర్ల సదానందం,ఎంపిటిసి సుతారి బాలకష్ణ,మాజీ సర్పంచులు,నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులది గోబెల్స్ ప్రచారం

- న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ

- ఘనంగా సీపీఐ(ఎంఎల్) 55వ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-కాశిబుగ్గ



కమ్యూనిజానికి కాలం చెల్లిందని కొన్ని పెట్టుబడిదారీ శక్తులు మీడియాను మేనేజ్ చేస్తూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయని న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎల్బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సీపీఐ(ఎంఎల్) 55వ ఆవిర్భావ వేడుకలు, లెనిన్154వ జయంతి సందర్భంగా పార్టీ జెండాను కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరూ సంఘటితంగా ఉద్యమించాలన్నారు. పెట్టుబడి దారుల బూటకపు మాటలను నమ్మవద్దని కమ్యూనిజం అజేయమన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగాల హామీని పక్కనపెట్టి అయోధ్య రామ జపం చేస్తూ ప్రజల్లో మత సెంటిమెంటును రెచ్చగొడుతూ ఓట్లు అడగడానికి వస్తున్నారని విమర్శించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనియెడల ప్రజా తిరుగుబాటుకు గురై గత ప్రభుత్వాలకు పట్టిన గతే పునరావతం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు నున్న అప్పారావు, మొగిలి వెంకట్ రెడ్డి, మర్రి మహేష్, ముషారఫ్, సమీర్, అజిత్, నరసింహ, వంశీ పాల్గొన్నారు

ఖిలా వరంగల్‌లో : పడమరకోట చమన్ వద్ద సిపిఐ ఎంఎల్ 55వ ఆవిర్భావ వేడుకలు, ప్రపంచ సోషలిస్టు రాజ్య నిర్మాత లెనిన్ 154వ జయంతి ఉత్సవాలను న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు గంగుల దయాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండి కోటేశ్వరరావు, రాచర్ల బాలరాజు, తీగల జీవన్, గంద్రతి హరిబాబు, కృష్ణ, వీరన్న, ప్రభాకర్, రాజు, అక్బర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

నర్రా అశోక్ జీవితం ఆదర్శనీయం

- ఎంసీపీఐ పొలిట్ బ్యూరో సభ్యుడు ఉపేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కాశిబుగ్గ



నీతి నిజాయితీ విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన నర్రా అశోక్ జీవితం ఆదర్శనీయమని ఎంసీపీఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లేపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖిలా వరంగల్ తూర్పు కోటలో అమరజీవి నర్ర అశోక్ సంతాపసభను ఎంసీపీఐ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక నాయకునిగా, సామాజిక, ప్రజా ఉద్యమాల కోసం నిలబడిన గొప్ప వ్యక్తి అశోక్ అని అన్నారు. అవినీతి అనైతిక రాజకీయాలను అలాంటి వ్యక్తులను సమాజం నుంచి దూరం చేయాలని ఎంతో ఆలోచించేవాడని అన్నారు. పార్టీ కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడంలో అశోక్ నిబద్ధతతో కృషి చేశారని అన్నారు. అశోక్ మతి పార్టీకి తీరని లోటని ఆయన ఆశయ సాధన కోసం మనమంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనే కుమారస్వామి వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, జిల్లా నాయకులు మంద రవి, వరంగల్ పార్లమెంటు అభ్యర్థి మాస్ సావిత్రి, గంగుల దయాకర్, పాలకుర్తి సత్యం, కందికొండ కుమారస్వామి, నగేష్, ప్రభాకర్, నర్సయ్య, ఐలయ్య, దివంగత నర్రా అశోక్ కుటుంబ సభ్యులు రాజేష్, రంజిత్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలను కాపాడుకుంటాం

మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

నవతెలంగాణ-కాశిబుగ్గ

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కష్టసుఖాలలో తోడుంటూ వారికి ఏఆపద వచ్చినా కాపాడుకుంటామని వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్‌కు చెందిన గంధం గోవింద్ కాంగ్రెస్ పార్టీ నుండి తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గోవింద్‌తో పాటు ఇతరులకు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరిన వారు అక్కడ ఇమడలేక తిరిగి సొంతగూటికి చేరుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చే వరకు వదలబోమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్



పార్టీ సీనియర్ నాయకులు ఎల్లావుల లలిత యాదవ్, చింతల యాదగిరి, కేతిరి రాజశేఖర్, 3వ డివిజన్ అధ్యక్షుడు నిరటి రాజు, నాయకులు పత్రి రాజ పోషాలు, పస్తం యాదగిరి, కొంగర సుదర్శన్, పస్తం రాజేష్, కొత్తపెల్లి యాదగిరి, రంగరాజు విజయ, తదితరులు పాల్గొన్నారు.



గురుకుల సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-నెక్కొండ

మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థి గురుకుల ఫలితాల్లో సీటు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యుగంధర్‌తో పాటు ఉపాధ్యాయులు, తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పత్తిపాక గ్రామానికి చెందిన మాదరావు శ్రీను-అమతల కుమార్తె మాదారపు అశ్రీతకు గురుకుల ప్రవేశ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నెక్కొండలోని బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగేందర్ చెప్పారు.ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో సీటు సాధించిన విద్యార్థి ఆశ్రితను శాలువాతో సన్మానించి మాట్లాడారు. తల్లి దండ్రులు ఒకరిద్దరు పిల్లలను చదివించడానికే ఇబ్బందులు పడుతున్న తరుణంలో శ్రీను-అమత దంపతులు కటిక పేదరికంలో ఉండి కూడా వారి ఐదుగురు పిల్లలకు తిండి పెట్టడానికి ఇబ్బంది పడుతూ పిల్లల చదువుల విషయంలో శ్రద్ధ చూపడంతో విద్యార్థి కష్టపడి సీటు దక్కించుకుందన్నారు. తల్లిదండ్రుల శ్రమకు తగ్గట్టే పిల్లలు కూడా మట్టిలో మాణిక్యాలు అనే పదానికి నిజమైన నిర్వచనాలుగా ఉంటూ చదువులో నిరంతరవద్ధిని సాధిస్తూ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కష్టపడి శ్రమించి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని యుగేందర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, దేవిలాల్, తల్లితండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చంద్రశేఖరం సేవలు శ్లాఘనీయం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చింత నెక్కొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జడల చంద్రశేఖరం విద్యార్థుల అభ్యున్నతి కోసం చేసిన సేవలు శ్లాఘనీయమని మండల నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి అన్నారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు చిదురాల సుదర్శన్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన పదవి విరమణ మహోత్సవ సభకు ముఖ్యఅతిథిగా మండల నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏనుగల్ కాంప్లెక్స్ ఇన్చార్జి హెచ్‌ఎం హైమవతి, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, అంజయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు ఝాన్సీ, నరసింహ రాములు, శ్రీనివాస్ నాగేశ్వరరావు, రాజకుమార్, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



లాభసాటి పంటలను సాగు చేయాలి

వెనగ్రో పాప్ కార్న్ ప్రొడక్షన్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-పర్వతగిరి

రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు లాభసాటి పంటలను సాగు చేయాలని వెనగ్రో పాప్ కార్న్ ప్రొడక్షన్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాల్యా తండా, చింత నెక్కొండ గ్రామాల రైతులకు సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిపియం సరిత,చంద్ర శేఖర్,ఏపీఎం తోటకూరి క్రిష్ణమూర్తి, గీతరాణి, సి సి లు సుధాకర్ వి వో ఏ లు,రైతులు గటిక మహేష్,చలపతి రావు, తాశం శెట్టి రఘు,నల్లపు రాములు, వెంకట్రాం నర్సయ్య, కోల రాములు, గొర్ల సాంబయ్య, సుధీర్‌రావు, గాడుదుల శ్రీనివాస్, బండి రాం కట్టయ్య, మదూరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ గుడికి మైక్ సెట్ వితరణ

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని దేవిలాల్‌తండాలో 22, 23న దుర్గమ్మ తల్లి పండుగ వేడుకలు జరుపుకునే క్రమంలో మందడపు భూషయ్య తన సతీమణి మందడపు అనసూర్య జ్ఞాపకార్థంగా రూ.10వేల విలువ గల మైక్ సెట్ ను సోమవారం దుర్గమ్మ గుడికి వితరణ చేశారు. ఈ సందర్భంగా మైక్‌సెట్‌ను గుడికి వితరణ చేసినందుకుగాను తండా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ భూషయ్యను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, మాజీ ఎంపీటీసీ ఎస్.కె మహమ్మద్ అలీ, మాజీ వార్డు మెంబర్ గుగులోతు వీరన్న,నాయకులు గుగులోతు భాస్కర్, ఇస్లావత్ వెంకన్న, భూక్య కిషన్, గూగుల్లోకి యాకూబ్, ఇస్లావత్ చక్రు, గుగులోతు చందు, గుగులోతు శ్రీనివాస్, గుగులోతు వెంకన్న జాటోతు రవి, లావుడియా విజేందర్ పాల్గొన్నారు.

డాక్టర్ సుధీర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి

- 40వ డివిజన్ కార్పొరేటర్ రవి

కాశిబుగ్గ : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి పిలుపునిచ్చారు. సోమవారం 40వ డివిజన్ నుంచి కార్పొరేటర్ రవి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు సుధీర్ నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా కలెక్టరేట్‌కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ స్థానానికి నాల్గో రోజు 11 నామినేషన్లు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా వరంగల్ లోక్ సభ నియోజక వర్గానికి సంబంధించి నాల్గో సోమవారం 10మంది అభ్యర్థులు 11నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. సోమవారం 15- వరంగల్ ఎస్సి పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి గా మారపల్లి సుధీర్ కుమార్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కు సోమవారం ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇండిపెండెంట్ (స్వతంత్ర) అభ్యర్థి గా తాళ్లపల్లి వెంకటయ్య (1) సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారని, అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థి గా ఇసంపల్లి వేణు ఒక సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఐఎన్‌సి అభ్యర్థి గా కడియం కావ్య (1) సెట్ నామినేషన్ పత్రాలను,ఇండిపెండెంట్ (స్వతంత్ర) అభ్యర్థి గా మంద నరేష్ (1) సెట్ నామినేషన్ పత్రాలను, స్వతంత్ర అభ్యర్థిగా బొచు రాజు (1) సెట్ నామినేషన్ పత్రాలను, స్వతంత్ర అభ్యర్థిగా శనిగరపు రమేష్ బాబు (2) సెట్ నామినేషన్ పత్రాలను, మేకల సుమన్, ధర్మ సమాజ్ పార్టీ రిజిస్టర్డ్ (అన్ రికగ్నైసడ్) అభ్యర్థిగా (1) సెట్ నామినేషన్ పత్రాలను, పొగుల అశోక్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ వేశారని, విదుథలై చిరు థైగల్ కాచి పార్టీ అభ్యర్థిగా మచ్చ దేవేందర్ ఒక సెట్ నామినేషన్ వేశారని రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య వివరించారు. కాగా, మొదటి, రెండవ, మూడవ, నాల్గవ రోజు కలుపుకుని ఇప్పటి వరకు మొత్తం 19 మంది అభ్యర్థులు 22 నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య తెలిపారు..



దర్గా కాజీపేట స్మశానవాటికలో మౌళిక వసతులు కరువు

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనైనా అభివృద్ధి జరిగేనా ?

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

గ్రామ పంచాయతీల పరిధిలోని వైకుంఠధామాలు అన్ని సదుపాయాలతో అన్ని వసతులతో పచ్చని చెట్లతో మనసును ఆహ్లాద పరుస్తూ ఉండగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పేరుకే నగర నడిబొడ్డున ఉన్న దర్గా కాజీపేట స్మశాన వాటిక ఏళ్లు గడుస్తున్నా కనీస సదుపాయాలు వసతులు లేక అభివద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురవుతుందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. 48వ డివిజన్ దర్గా కాజీపేట ప్రాంత ప్రజలు కు సంబంధించిన స్మశాన వాటిక మాత్రం 49 డివిజన్ పరిధిలో ఉంటుంది దర్గా కాజీపేట స్మశాన వాటికకు ప్రహరీ గోడ లేనందువలన పశువులు జంతువులు ఏదేచ్ఛగా తిరుగుతూ అందులో నిర్మించి ఉన్న గోరీలను భద్రపరిచిన అస్థికల ను ధ్వంసం చేస్తున్నాయి వ్యర్థాలను చెత్తను గోరిల్లా మధ్యలో డంపింగ్ చేయడం వల్ల ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంటుంది అని ఉన్న కంకర మట్టి రోడ్డు సరిగా లేక గుంతలు ఏర్పడి వానలు పడితే గుంతల్లో నీరు నిల్వ ఉండి రోడ్డు వెంబడి ప్రయాణించేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారు అధికారుల నాయకుల పర్యవేక్షణ లేక స్మశాన వాటిక స్థలంపిచ్చి మొక్కలు తుమ్మ చెట్లతో పూర్తిగా నిండి పోయింది.ఈ కష్టాలన్నీ తొలగిపోవడానికి దర్గా ప్రాంత ప్రజలు దర్గా స్మశాన వాటిక అస్తవ్యస్తంగా సమాధుల నిర్మాణం చేపట్టకుండా స్మశాన వాటిక భూమిని పరిరక్షించుకోవడానికి దర్గా స్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మించాలని సెంట్రల్ లైటింగ్ సిస్టం పెట్టాలని సరైన రోడ్డు మార్గం వేయాలని నీటి వసతిని కల్పించి స్నానాల గదులు బట్టలు మార్చుకొని గదులు మరుగుదొడ్లను నిర్మించాలని స్మశాన వాటిక లోని పిచ్చి చెట్లను తొలగించి పూర్తిగా పచ్చని చెట్లతో ఒక పార్కును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు మారాయి కనుక కనీసం ప్రస్తుత ప్రభుత్వ హాయంలో అయినా దర్గా కాజీపేట స్మశాన అభివద్ధి అన్ని విధాల జరిగే నా అని దర్గా ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు

పరిశుభ్రంగా ఉంచాలి : చిప్ప శ్రీనివాస్ స్థానికుడు



స్మశాన వాటికలో ఉన్న వ్యర్థాలను చెత్త నో పిచ్చి చెట్లను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని స్మశానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని అస్థికలకు గదులు నిర్మించి భద్రత కల్పించాలని స్నానపు గదులు నిర్మించాలని నీటి వసతి కల్పించాలని పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని సరైన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వ హయాంలోనైనా దర్గా కాజీపేట స్మశాన వాటిక పూర్తిగా అభివద్ధి చెందాలని స్థానికుడైన చిప్ప శ్రీనివాస్ నాయకులను అధికారులను కోరారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవి

రైతులను నట్టేట ముంచిన రేవంత్ ప్రభుత్వం

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నర్సంపేట



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవిత విమర్శించారు. సోమవారం నర్సంపేట పట్టణంలోని ఎంఏఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రచార సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసి, అనేక హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ నాలుగు నెలల్లో హామీలను నెరవేర్చక ప్రజలను మోసగించిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేననీ తేలిపోయిందని విమ ర్శించారు. తెలంగాణకు కేసీఆర్ మాత్రమే రక్షణ అని ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులను నట్టేటముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే పెద్ది

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. రెండు లక్షల రుణ మాఫీ హామీని చేతులెత్తశారని, రైతు భరోసా నేటికీ అమలు చేయలేకపోయారన్నారు. ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబం మీద దుష్ప్రచారం చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు నేడు హామీలపై దాటి చేస్తున్నారన్నారు. గెలిచిన ఎమ్మెల్యే నాలుగు నెలల్లో కొత్తగా తెచ్చింది లేకపోగా తాను తెచ్చిన నిధులను రద్దు చేయించి నియోజక వర్గ ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నాడన్నారు.సీఎం రేవంత్ రెడ్డి దగ్గరకు పోయేది లేదు.. ఈయన దగ్గరకు ఆయన వచ్చేది లేదని ఎద్దేవా చేశారు.నాటి కేసీఆర్ పాలన జనరంజకంగా సాగించామనీ గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలు కాంగ్రెస్ కపట నాటకాన్ని ఎండగట్టాలనీ సూచించారు. ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, ఎంపీపీ మోతె కలమ్మ, జెడ్పీటీసీ కోమండ్ల జయమ్మ గోపాల్ రెడ్డి, ఎంపిటిసిలు, కౌన్సిలర్స్, తాజా మాజీ సర్పంచ్, క్లస్టర్ భాద్యులు, మండల కమిటీ, పట్టణ కమిటీ ,గ్రామ కమిటీ బాధ్యులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం జీఆర్ గార్డెన్స్ లో ప్రచార సన్నాహాల సమావేశంలో హాజరు అయ్యారు. మండల నాయకులు..బాల్నె వెంకన్న, పత్రి నాయక్, బుర్రి తిరుపతి, జక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభ స్థలం పరిశీలన

పాల్గొన్న ఎమ్మెల్యేలు రేవూరి, కడియం, నాయిని, కేఆర్ నాగరాజు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



ఈ నెల 24న కాజీపేట మండలం మడికొండ ఈనాడు కార్యాలయం ఎదురుగా నిర్వహించనున్న వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ భారీ బహిరంగ సభా స్థలాన్ని పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరువనున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లపై చర్చించారు. సభ ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూడాలని నేతలకు సూచించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు భారీగా ^రలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరకాలకు తరలిన యూత్ కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దామెర

సోమవారము పరకాలలో జరుగుతున్న వరంగల్ పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ నాయకుల ఎన్నికల సన్నాహక సమావేశానికి దామెర మండలంలోని అన్ని గ్రామాల నుండి యూత్ కాంగ్రెస్ నాయకులు మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు నల్ల సుధాకర్ ఆధ్వర్యంలో దామెరలో బైక్ ర్యాలీ నిర్వహించి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలే పాక శ్రీనివాస్ జండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పరకాల కు తరలిన యూత్ నాయకులు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దురిశెట్టి బిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వరరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జన జాతర బహిరంగ సభ

నవతెలంగాణ-పర్వతగిరి

ఈ నెల 24న జరిగే సీఎం ఏనమల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే జన జాతర బహిరంగ సభకు పర్వతగిరి మండలం నుండి అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీలు 45 బూతుల నుండి అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముఖ్య నాయకులు అనుబంధ సంఘాల నాయకులు వివిధ హెూదాలో ఉన్న మండల జిల్లా అధ్యక్షులు గ్రామ నాయకులు సభకు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఆయనతో పాటు టౌన్ అధ్యక్షులు కుసం రాంచందర్, సొసైటీ డైరెక్టర్ గంగాధర్ రావు, సునీల్ రావు, సుధాకర్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు మంత్రి 'కొండా'

హనుమాన్ జయంతి శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

అంజనీసుతుడు, రామదాసుడు అయిన హనుమంతుడు హిందూ ధర్మానికి ప్రతీక అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. హనుమంతుని పేరును తలుచుకోగానే ఆధ్యాత్మిక భావన అంతరంగంలో నిండుకుంటుందని అన్నారు. హనుమంతుని ఆరాధన గొప్ప క్రమశిక్షణను, జీవనశైలిని అలవర్చుతుందని అన్నారు. పరాక్రమానికి, ఆరోగ్యానికి, కార్యదక్షతకు, ధైర్యసాహసాలకు మారుపేరైన ఆంజనేయుడు యువతకు గొప్ప స్ఫూర్తి అని మంత్రి పేర్కొన్నారు. హనమంతుని ప్రేరణతో ప్రతి ఒక్కరు తమలోని శక్తులను లక్ష్యం దిశగా పయనింపజేయాలన్నారు.

నేడు చౌకీదర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండీ అక్బర్ ఖాన్

నవతెలంగాణ-మహాదేవపూర్

నేడు(మంగళవారం) సాయంత్రం 4గంటలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన మహాదేవపూర్ మండల కేంద్రంలోని చౌకీదర్ చౌర స్తాలో కార్నర్ మీటింగ్ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండి అక్బర్ ఖాన్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ హాజరవుతున్నారని, మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా సోదరీమణులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గడ్డం వంశీని ఆదరించాలి

- శ్రీపాద ట్రస్ట్ చైర్మెన్ దుద్దిళ్ల శ్రీనుబాబు
- కాటారం సబ్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-మల్హర్‌రావు



రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో మంథని నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీతో గడ్డం వంశీ కృష్ణను ఆదరించాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మెన్ దుద్దిల్ల శ్రీనుబాబు కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన గ్యారంటీలను ప్రతి గడప గడపకు చేరవేయాలని, వంశీ కృష్ణ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. సోమవారం కాటారం సబ్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమ్మేళన కార్యక్రమంలో శ్రీనుబాబు హాజరై మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి గడ్డం వంశీకష్ణ కి మంథని నియోజకవర్గం నుండి లక్ష మెజార్టీ వచ్చేలా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దివాలా తీసిందని, కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన 6 గ్యారంటీలు విజయవంతంగా అమలు కావాలంటే కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా ప్రభుత్వం ఏర్పాడాలని అన్నారు. శ్రీధర్ బాబు గెలుపునకు ఏవిధంగా పని చేశారో వంశీకృష్ణ గెలుపునకు అదేవిధంగా కృషి చేయాలని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో 6 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, ఆ నియోజకవర్గాల కంటే ఎక్కువ మంథని ప్రాంతం నుండి అత్యధిక మెజార్టీ రావడానికి పనిచేయాలని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ఎస్సిసెల్ అధ్యక్షుడు దండు రమేష్,మల్హర్ ఎంపిపి చింతలపల్లి మలహల్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితేల రాజయ్యయూత్ నాయకుడు రాహుల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, సింగల్ విండో చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పిటిసి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామప్ప బోట్ డ్రైవర్లకు అవగాహన



నవతెలంగాణ - ములుగు

వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ శివారులోని రామప్ప సరస్సులో బోట్ నడిపే డ్రైవర్లకు వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చల్లా రాజు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు నిత్యం రామప్ప దేవాలయాన్ని సందర్శించడం జరుగుతుందని అన్నారు. ఈ క్రమంలో పర్యాటకులు సరస్సులో బోటు షికారు చేయటానికి ప్రయత్నం చేస్తారని, బోటు డ్రైవర్లు వారికి సేఫ్టీ జాకెట్లు వేయించిన తరువాతనే బోటులో ఎక్కించుకోవాలని సూచించారు. సేఫ్టీ పరికరాలు ఉపయోగించడం వల్ల పర్యాటకులకు ఎలాంటి అపాయం సంభవించకుండా ఉంటుందని అన్నారు. బోట్ డ్రైవర్లు నియమాలను ఉల్లంఘించి ఇష్టం వచ్చినట్లు నడుచుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బీఆర్ఎస్ ములుగు మండల అధ్యక్షునిగా పాలేపు శ్రీనివాస్



నవతెలంగాణ - ములుగు

భారత రాష్ట్ర సమితి ములుగు మండల అధ్యక్షునిగా మహమ్మద్ గౌస్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పాలేపు శ్రీనివాస్‌ను భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణరావు ఆదేశాల మేరకు సోమవారం నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికకు సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షులకు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కి, జిల్లా జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతికి, పొరిక గోవిందనాయక్, ఎంపీపీ గంట్రకోట శ్రీదేవి సుదీర్, జెడ్పీటీసీ సకినాల భవాని, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షులు, మండలంలోని ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ కార్నర్ సమావేశం



విజయవంతం చేయాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్లలో నేడు(మంగళవారం) సాయంత్రం కార్నర్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు అధ్యక్షతన మండల కాంగ్రెస్ కార్నర్ సమావేశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ హాజరవుతున్నారని తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,యూత్ నాయకులు,వ ఎహిళ నాయకురాళ్లు,కార్యకర్తలు,కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అత్మహత్యాయత్నం చేసుకున్న పంచాయతీ కార్యదర్శి మృతి



నవతెలంగాణ-గణపురం

మండలంలోని కర్కపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పల్లెబోయిన శ్రావణి ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడగా వరంగల్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ప్రైవేటు ఆసుపత్రిలో సుమారు 24 గంటల పాటు చికిత్స అందించినప్పటికీ ప్రాణాపాయ స్థితి నుండి ఆమె బయట పడలేదు. సంఘటన జరిగిన వెంటనే జిల్లా కలెక్టర్ జిల్లా పోలిస్ యంత్రాంగం తీవ్రంగా స్పందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అన్ని కోణాల్లోనూ సంఘటనకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నారు. శ్రావణి వాడిన మొబైల్ ఫోన్ దొరకకపోవడంతో పోలీసులు దర్యాప్తులో కొంత జాప్యం జరుగుతోంది. ఆదివారం ఉదయం ఆమె ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు ఆమె మృతికి సంబంధించిన కారణాలు తెలియ రాలేదు. మృతురాలికి భర్త నరేష్, ఒక పాప, బాబు ఉన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు ముమ్మరం చేశామని గణపురం ఎస్ఐ మచ్చా సాంబమూర్తి తెలిపారు. శ్రావణి అకాల మృతి పట్ల మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం సంతాపం తెలిపింది.

దానా బస్తాల వితరణ



నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాల గోమాతలకు గణపురం వాస్తవ్యులు హైదరాబాదులో నివాసముంటున్న దూలం సంజన తిరుపతిగౌడ్‌ల కుమారుడు అభినవ్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరేష్ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. గోశాలకు దానా బస్తాలను అందజేసిన సంజన తిరుపతి గౌడ్ దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

అస్వస్థతకు గురై మహిళ మృతి

నవతెలంగాణ-మహాదేవపూర్



ఎండతీవ్రతకు తాళలేక అస్వస్థతకు గురై మహిళ మృతిచెందిన సంఘటన మహాదేవపూర్ ఉమ్మడి మండలంలోని పలిమెల మండల కేంద్రం పలిమెల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పలిమెల ఎస్సై జి తమాషా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పలిమెల గ్రామానికి చెందిన కుమ్మరి అనిత(45) గత వారం రోజుల నుండి కూలీ పనికి వెళ్లి ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై మృతిచెందింది. మృతురాలి అత్త కుమ్మరి చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హెచ్‌సిఏ బోర్డు కమిటీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి

- ఐపీఎల్ టికెట్లను సాధారణ ధరలకు కౌంటర్ల ద్వారా ఇవ్వాలి
- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్

నవతెలంగాణ-భూపాలపల్లిటౌన్



హెచ్‌సిఏ బోర్డు కమిటీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని, ఐపీఎల్ టికెట్లను సాధారణ ధరలకు కౌంటర్ల ద్వారా ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణ కేంద్రం లోని రావినారాయణ భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. వేముల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 25 తేదిన సన్ రైజర్స్ హైదరాబాద్, బెంగుళూరు, రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరగాల్సి ఉందని అన్నారు. ఈ మ్యాచ్ కు సంబంధించిన టికెట్లను గత శుక్రవారం విక్రయానికి పెట్టారని, అయితే టికెట్లను పేటిఎంలో అమ్మకానికి పెట్టిన క్షణాల్లోనే టికెట్లను అమ్ముడు పోయాయంటూ బోర్డ్ ప్రకటించారని తెలిపారు. దాదాపు 36 వేలకు పైగా టికెట్లను అమ్మకానికి పెట్టిన అర గంట గంటలోపే ఏవిధంగా అమ్ముడుపోతాయో హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ యాజమాన్యాలు రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సెలబ్రిటీలు, ప్రభుత్వ అధికారులు, ప్రభావవంతమైన వ్యక్తులకు టిక్కెట్లు, కాంప్లిమెంటరీ పాస్‌లు వారి సంబంధాలను పెంచుకోవడానికి ఇస్తున్నారని అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్‌ఓ) నిర్వాహకులు మాత్రం టికెట్లను బ్లాక్ చేసి బ్లాక్ మార్కెట్ ద్వారా అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ లేదా పేటీఎం ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో క్రికెట్ అభిమానులు నిరాశకు గురయ్యారని అన్నారు.

హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్‌ల మధ్య సమన్వయం కొరవడిందని, టికెట్ జారీ చేసే సంస్థ పేటీఎం క్రికెట్ ప్రేమికులను పణంగా పెట్టి అంతర్గత విభేదాలను సద్వినియోగం చేసుకుంటోందని మండిపడ్డారు. గతంలో హెచ్‌సిఏ, ఐపిఎల్ నిర్వాహకులు టిక్కెట్ల విక్రయాల వివరాలను బహిర్గతం చేసేవారన్నారు. కానీ నేడు ఆచరణను నిలిపివేశారని ధ్వజమెత్తారు. బల్క్ టిక్కెట్లను కార్పొరేట్ సంస్థలకు విక్రయించడం టిక్కెట్ల కొరతకు దారి తీస్తోందని అన్నారు. ప్రభుత్వం టిక్కెట్ల విక్రయాన్ని ఆధార్ కార్డులకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఐపీఎల్ టిక్కెట్ల విక్రయంతో మాకు ఎటువంటి సంబంధం లేదని, ఇందులో ఎస్ఆర్‌హెచ్,పేటిఎం ప్రమేయం మాత్రమే ఉందని ప్రకటనలు చేసిన హెచ్‌సీఏ బోర్డ్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు నివేదిక ఇవ్వలేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన టికెట్ల విక్రయాలను అక్రమ మార్గాన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరెవరికి టికెట్లను జారీ చేశారో వాటి పూర్తి వివరాలను రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయం లో ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు, పలు యువజన సంఘ నాయకులు వెళ్లి వివరణ కోరగా వారిని అరెస్టు చేసి కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అరబోయిన వెంకటేష్, తిరుపతి, రమేష్ చారి, కౌశిక్, బౌత్ కమలాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య

నవతెలంగాణ - ములుగు



ఈనెల 24 న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాలు విడుదల అవుతున్న దృష్ట్యా, విద్యార్థులు పరీక్షలో ఫెయిల్ అయితే తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోను కాకూడదని, తిరిగి మళ్లీ పరీక్ష రాసి పాస్ అయ్యే అవకాశాలు ఉన్నాయని, ఆత్మహత్యలకు పాల్పడకూడదని, విద్యార్థులు మనో ధైర్యంతో మానసిక ఒత్తిడిని జయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. సోమవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. ఎవరైనా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురైతే వారు జిల్లాలో అందిస్తున్న టెలి మానస సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. వారు వెంటనే టోల్ ఫ్రీ టెలి మానస కాల్ సెంటర్ 14416 నంబర్ కు కాల్ చేసి సంప్రదించాలని అన్నారు. లేదంటే ములుగు జిల్లా ఆస్పత్రిలో మానసిక ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని అన్నారు. వారిని సంప్రదిస్తే కౌన్సిలింగ్ సేవలు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వారి పిల్లల పరీక్ష ఫలితాల పట్ల వారిని మానసిక ఒత్తిడికి గురి చేయవద్దని అన్నారు. పిల్లల పట్ల వారు బాధ్యతాయుతంగా ఉండి వారికి మనో నిబ్బరాన్ని, ధైర్యాన్ని, కలిగించాలని కోరారు. ఇందుకు టేలి మానస టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

దేవరాంపల్లిలో 35 వాహనాలు సీజ్

నవతెలంగాణ-మహాదేవపూర్



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దేవరాంపల్లిలో సోమవారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో కొయ్యూరు, అడవి ముత్తారం ఎస్ఐలతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరించినట్లైతే వంద నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ అభినవ్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు సాఫీగా జరిగేందుకు ప్రజలు తమ ఓటు హక్కును అందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 35 వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. ఎనిమిది వాహనాలకు నంబర్ ప్లేట్లు లేవని అన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేసినట్లయితే, వాహనంతో పాటు పిల్లలు, వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట రీత్యా చర్యలు చేపట్ట నున్నట్లు హెచ్చరించారు. 108 అంబులెన్స్ వాహనాలకు దారి ఇవ్వాలని, రోడ్డు భద్రతా నియమాలను అందరు వాహన చోదకులు పాటించాలని సూచించారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుందయ్యపల్లిలో 2 ఆవుల అపహరణ

నవతెలంగాణ-గణపురం

మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కుందయ్యపల్లి గ్రామంలోని రైతు వేములపల్లి కట్టమల్లుకు చెందిన 2 అవులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధిత రైతు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రోజువారీ గా ఆదివారం రాత్రి మేతకువెల్లి వచ్చిన ఆవులను ఇంటి ఆవరణలో కట్టివేశానని, తెల్లవారుజామున చూసేసరికి రెండు అవులు కనబడలేదని వాపోయారు. అనంతరం బొలెరో వాహనంలో గుర్తు తెలియని వ్యక్తులు తరలించినట్లు అనుమానం వస్తుందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్థానిక ఎస్ఐ మచ్చ సాంబమూర్తి ఆదేశానుసారం పోలీస్ సిబ్బంది సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో గ్రామాలలో ఎక్కడైనా వాటి ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని స్థానిక ఎస్సై ప్రజలకు సూచించారు.